మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట



# తెలంగాణపై వివక్ష

- పక్షపాత వైఖరి తేటతెల్లమైంది
- 8 మంది ఎంపిలను గెలిపించిన తెలంగాణకు చేసింది ఏంటి?
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై23 ప్రభాతవార్త:** తెలం గాణపై కేంద్ర ప్రభుత్వ వివక్ష పక్షపత వైఖరి అర్థమైం దని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఆయన స్పంది స్తూ తెలంగాణపట్ల ప్రధానమంత్రికి ఉన్న పక్షపాత వైఖరి ఈ బడ్జెట్‌తో తేలతెల్లమైందని, తెలంగాణకు ఒక్క ప్రాజెక్టుకు కూడా చేయూత ఇవ్వ లేదని గతంలో మొండి వైఖరి చూపాయని తెలంగాణ విషయంలో తల్లిని చంపి బిడ్డను తీసింద్రు అని ఎన్నోసార్లు వెటకారగా తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, తెలంగాణ విద్యా ర్థుల, యువకుల బలిదానాన్ని అపహాస్యం చేసిన చరిత్ర ప్రధానమంత్రి నరేంద్రమోడీదని ఆయన మండిపడ్డారు. ఆయన మనసులో ఏ విషం పెట్టుకున్నారో లేదా నింపుకున్నారో కానీ మూడవ టర్మ్‌లో అధికారంలోకి వచ్చి బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటికి ఒక్క తెలంగాణ ప్రాజెక్టుకు చేయూతనివ్వలేదని,పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు నిధులు ఇవ్వలేదని, తెలం గాణకు విద్యా సంస్థలను ఒక్కటి కూడా ఇవ్వలేదని, పారిశ్రామిక క్యారిడార్‌ను ఇవ్వలేదని పూర్తిగా బడ్జెట్‌లో మొండిచేయి చూపారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పక్క రాష్ట్రంలో కేవలం ముగ్గురిని ఎంపిలుగా గెలిపిస్తే మరి ఎనిమిది మంది ఎంపిలను గెలిపించిన తెలం గాణ ప్రజలకు ఏం సమాధానం చెప్తారని ఆయన బిజెపి నాయకులను ప్రశ్నించారు. మేమే తెలంగాణలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నయమని అంటూ జబ్బలు చర్చకుంటున్న బిజెపి నాయ కులు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పీఎం ముందు ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ముందు మీ నోర్లు పడిపోయాయని ఆయన ప్రశ్నిచారు.

# బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి

**మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి**



ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై23 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో తమ మిత్రపక్షా లకు చెందిన రాష్ట్రాలకు మాత్రమే కేటా యింపులు చేసి, తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ లో మొండిచేయి చూపిందని, కేవలం మోడీ కుర్చీ కాపాడుకునేందుకు కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు ఉందని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమ రావతికి రూ.16 వేలకోట్లు కేటాయించి, తెలంగాణ ప్రజలకు వరప్రదాయిని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధు లు కేటాయించకుండా మొండిచేయి చూపి, తెలంగాణ ప్రజల ఆశలపై కేంద్ర ప్రభుత్వం నీళ్లు చల్లిందని అన్నారు. బడ్జెట్‌లో ప్రాపర్టీ టాక్స్ 12.5 శాతం పెంచడం వల్ల సామాన్యులపై తీవ్ర భారం మోపిందని, రేపు ఆర్థిక ఇబ్బందుల కారణంగా సామాన్యులు తమకున్న ఫ్లాట్ లేదా ఇంటిని అమ్ముకున్న 12.5% ప్రభుత్వానికిటాక్స్ కట్టడానికి బడ్జెట్‌లో ప్రతిపాదించడం సిగ్గుచేటని కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై జిఎంఆర్ మండిపడ్డారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా సామాన్యులు తమ ఇంటిని లేదా ఫ్లాట్‌ను అమ్ముకుంటే 12.5 శాతం ప్రాపర్టీ టాక్స్ కట్టమనడం శోచనీయమని, ఇది బిజెపి దివాలాకోరుతనానికి నిదర్శనం అని పేర్కొన్నారు.

# తెలంగాణపై కక్షపూరిత వైఖరి చూపిన కేంద్రం

- బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకే ప్రాధాన్యత : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి ప్రతినిధి జులై 23 ప్రభాతవార్త :** బడ్జెట్ కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం కక్షపూరిత వైఖరి ప్రదర్శించిందని కేవలం బీహా ర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకే ప్రాధాన్యత ఇచ్చిందని వనపర్తి ఎమ్మె ల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఏపీలోని పోలవరం కు నిధులుకేటాయించినప్పుడే తెలంగాణలోని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు కేటాయించడంలో ఎందుకు వివక్ష చూపించా రని ఆయన ప్రశ్నించారు. తెలంగాణపై నరేంద్ర మోది చూపించే కక్షపూరిత వైఖరిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఖండి స్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తయారు చేసిన బడ్జెట్ కేవలం కుర్చీ కాపాడుకునేందుకే తయారుచేసినట్లు ఉందని నిరుపేద ప్రజలకు రాష్ట్రాలకు ఉపయోగపడేలా లేదని ఆయన విమర్శించారు. బడ్జెట్‌పై కేంద్రంలో నిరసన తెలిపేందుకు తెలంగాణ బిజెపి.ఎంపీలు కాంగ్రెస్ ఎంపీలతో పాటు కలిసి రావాలని ఆయన పేర్కొన్నారు.తెలంగాణ బిజెపిప్రజాప్రతినిధులు మంత్రిపదవుల కోసంతెలంగాణ ఆత్మగౌర వాన్ని మోది వద్ద తాకట్టు పెట్టకూడదని ఆయన విమర్శించారు. ఇలాంటి కక్షపూరిత ధోరణి ఇలాగేకొనసాగితే బిజెపికితెలంగాణరాష్ట్రంలో మనుగడలేకుండా పోతుందని ఆయన అన్నారు.

# దేశ అభివృద్ధికి పెద్దపీట వేసిన బడ్జెట్

- బిజెపి రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్



**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 23 ప్రభాతవార్త:** భారతదేశాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా 48.21 లక్షల కోట్లతో ఈ బడ్జెట్‌ను రూపొందించడం జరిగిందని బిజెపి రాష్ట్రకోశాధికారి బండారి శాంతికుమార్ ఒక ప్రకటనలో అన్నారు. గత పదేళ్లలో భార తదేశం అన్ని రంగాలలో అభి వృద్ధి చెందిందని, ఈ అభివృద్ధిని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ బడ్జెట్ ఉందని ఆయన వ్యాఖ్యానిం చారు. గ్రామాలలో అభివృద్ధి, మౌలిక వసతుల నిర్మాణానికి 2.66లక్షల కోట్లతో కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఆయన గుర్తు చేశారు. హైదరా బాద్, బెంగుళూర్ కారిడార్ అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించడం చాలా ఆనందంగా ఉందనిబండారి శాంతికుమార్ హర్షం వ్యక్తం చేశారు. భారతదేశ అభివృద్ధిని, ప్రజల సంక్షే మాన్ని పరిగణలోకి తీసుకుని ఈ బడ్జెట్‌ను తయారు చెయ్యడంతో దేశ ప్రజలందరూ అభినం దిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. పట్టణాభివృద్ధికి, వ్యవసాయ, మానవ వనరుల అభివృద్ధికి ఈ బడ్జెట్ అధిక ప్రాధాన్యతను ఇచ్చిందని బండారి శాంతికుమార్ స్పష్టం చేశారు.



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

# బోనమెత్తిన పాలమూరు

**మహబూబ్‌నగర్,జులై23 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం పాత పాలమూరులోని పోచమ్మ దేవాలయంలో బోనాల పండగ ఉత్సవాలలో వైభవంగా నిర్వహించారు. మహిళలు భక్తి శ్రద్ధలతో బోనం తయారు చేసుకుని పోచమ్మ ఆలయంలో సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా తమ మొక్కులు చెల్లించుకుని ఏడాది వర్షాలు బాగా కుర వాలని పంటలు బాగా పండాలని వేడుకున్నారు. అదేవిధంగా మోతినగర్, టిడిగుట్ట, ఎక్స్ రోడ్ వద్ద పోచమ్మ బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. బోనాల ఉత్సవాల్లో మాజీ మంత్రివర్యులు డా.వి.శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యనందించాలి

- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



పాఠశాల మరమ్మతులపై ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

**బిజినేపల్లి,జులై23 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించా లని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం బిజినపల్లి మండల కేంద్రంలోని సంతబజార్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి ఐదో తరగతి విద్యార్థుల గణితంలో తీసివేతలు, భాగహారం సామర్థ్యాలను కలెక్టర్ స్వయంగా పరిశీ లించారు. విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్న కలెక్టర్, ఉపాధ్యాయుల హాజరు గురించి వాకబు చేశారు. తరగతి గదులను సందర్శించి, విద్యార్థులకు అందిస్తున్న బోధనా తీరును పరిశీలించారు. ప్రభు త్వ బడులలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే కాకుండా విద్యార్థులకు ఉచితంగా ఏకరూప దుస్తులు,పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు అందించడం జరుగుతోందని గుర్తు చేశారు. ప్రభుత్వ తోడ్పా టును సద్వినియోగం చేసుకోవాలని, ఏకాగ్రతతో చక్కగా చదువుకొని తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తేవాలని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. ఏవైనా సందేహాలు ఉంటే ఎప్పటికప్పుడు ఉపాధ్యాయు లను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల సామర్థ్యాలపై సంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యా ప్రమాణాలు చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం తీసుకోవలసిన జాగ్రత్తలు, మెరుగైన విద్యా ప్రమాణాలు అందించేందుకు తీసుకుంటున్న, తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు జారీ చేశారు. పాఠశాలలోని అన్ని గదులను కలెక్టర్ పరిశీలించి, వర్షానికి గదుల్లోకి నీరు కారుతుండడం గమనించి, అందుకు కావలసిన ఏర్పాట్లను చేయాలని ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పాఠశాల వంటగది నిర్మాణాన్ని చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుత వంటగదిని కలెక్టర్ పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా 9.5 లక్షల రూపాయలతో పాఠశాలకు కావలసిన నిర్మాణ పనులు, రిపేర్లను పూర్తి చేయాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుని పాఠశాలలో ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పై అంతస్తులో ఉన్న తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలోని తరగతి గదుల్లో వర్షపు నీరు కురవకుండా తగిన మరమ్మతులు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారి రమాదేవి, బిజినపల్లి తహసిల్దార్ శ్రీరాములు, ఎంపిడిఓ కతలయ్య, పిఆర్ఏఈ రెడ్డప్ప, జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రాములు నాయక్ తదితరులు ఉన్నారు.

# ఆగస్టు 15 మిల్లర్లకు డెడ్‌లైన్

- వానాకాలం 55 శాతం యాసంగి మాత్రమే సరఫరా
- సీఎంఆర్ డెలివరీ సకాలంలో పూర్తి చేయాలి
- సమీక్ష నిర్వహించిన కలెక్టర్ విజయేంద్రబోయి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్రబోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 23 ప్రభాతవార్త:** సిఎం ఆర్ డెలివరీ సకాలంలో నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైస్ మిల్లర్‌లు, పౌర సరఫరాల అధికారులతో సీఎంఆర్ డెలి వరీపై జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, రెవెన్యూ అదన పు కలెక్టర్ ఎస్.మోహనరావుతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రైస్ మిల్ల ర్లందరికి ఐడిఓసి, మీటింగ్ హాల్లో వానాకాలం సీజన్



హాజరైన అధికారులు

(ఖరీఫ్) 2023,24లో 55శాతం సీఎంఆర్ పూర్తి చేసినట్లు యాసంగి (రబీ) సీజన్‌కు సంబంధించి 25% పూర్తయి నట్లు తెలిపారు.2023,24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కస్టమ్ మిల్లింగ్ బియ్యం (ఎఫ్‌సిఐ) మిగిలిన వాటిని రోజు వారిగా, వారం వారిగా లక్ష్యాన్ని నిర్దేశించి ఆగస్టు నెల 15వ తారీకు లోపల మిల్లర్‌లు డెలివరీ చేయాలని ఆమె ఆదేశించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి, పౌరసర ఫరాల మేనేజర్ డిఎం (సివిఎస్) మరియు డిటి (ఎన్‌ఫోర్స్ మెంట్) నిరంతర పర్యవేక్షణ జరిపి త్వరితగతిన సీఎంఆర్ టార్గెట్స్ పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా సిఎం ఆర్ మొదలు పెట్టనిరైస్ మిల్లర్లకు సీఎంఆర్ మొదలుపెట్టి త్వరగా ఎఫ్‌సిఐకి డెలివరీ చేయాలని ఆదేశించారు.

# ప్రభుత్వ మెడికల్ కళాశాల పనులు సత్వరం పూర్తి చేయాలి

## గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల, జులై 23 ప్రభాతవార్త:** ప్రభుత్వ మెడికల్ కళాశాల పనులన్నింటిని వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకో రావాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కాన్ఫరెన్సు హాల్ నందు నూతన మెడికల్ కళాశాలకు సంబంధించిన పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ, ఎన్ఎంసీ మార్గదర్శకాలకు అనుగుణంగా వైద్య కళాశాలను ఏర్పాటు చేయాలని సూచించారు.హస్పిటల్‌లో ఉన్న పోస్టుల వివరా లు, అర్హతలు తెలియజేసినట్లయితే ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయుటకు వీలు పడుతుందన్నారు. అవసరమైన పరికరాలతో పాటు హస్పిటల్స్‌లోని బెడ్స్ మరియు ఇతర వైద్య ఎక్విప్మెంట్స్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అవి సరిగ్గా పనిచేస్తున్నాయా లేదా పరిశీలిం చుకోవాలని సూచించారు. అవసరం మేరకు పరికరాలను అలంపూర్ ఆసుపత్రి నుండి తెప్పించాలన్నారు. మెడికల్ కాలేజీలో ప్రొఫెషనల్ అధ్యాపకులు అందరూ కలిసి ఒక కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మెడికల్ కాలేజీలకు కావాల్సిన నీరు, విద్యుత్తు వంటి అన్ని వసతులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికా రులకు ఆదేశించారు. ప్రతి ఒక్క అంశాన్ని పరిగణలోకి తీసుకుని, అందరూ సమిష్టిగా పని చేసి, మెడికల్ కళాశాలను త్వరగా సిద్ధం చేయాలన్నారు.ఈ సమావేశంలో మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ పార్వతి, డిప్యూటి డిఎంహెచ్ఓ సిద్ధప్ప,హస్పిటల్ సూపరింటెండెంట్ డా.నవీన్ క్రాంతి, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డా.వృశాలి, మిషన్ భగీరథ ఈఈ భీమేశ్వర్‌రావు, ఎంప్లాయిమెంట్ అధికారి ప్రియాంక, కళాశాల మెడికల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాల భవనాన్ని సందర్శించిన కలెక్టర్

**గద్వాల జులై 23 ప్రభాతవార్త:** పట్టణ శివారులో నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కాలేజీలో ఉన్న వసతులను పరిశీలించారు. మెడికల్ కళాశాలకు అనుమతుల అనుగుణంగా అన్ని సౌకర్యాలు కల్పించి డాక్టర్లు, సిబ్బందిని నియమించే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు ఆయన అన్నారు. డిపార్ట్‌మెంట్ వారీగా అవసరాలను అడిగి తెలుసుకున్నారు. పనులలో అవసరమైన సమ స్యలు ఉంటే తమ దృష్టికి వెంటనే తీసుకురావాలని కలెక్టర్ సూచించారు.

# ఘనంగా వన మహోత్సవ కార్యక్రమం

- వన మహోత్సవంలో భగాంగా ప్రతి ఇంటికి ఇచ్చే మొక్కలు పళ్ళ మొక్కలు అయి ఉండాలి
- లక్ష్యం మేరకు మొక్కలు నాటి ఆన్లైన్‌లో నమోదు చేయాలి : జిల్లా ఇంఛార్జ్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్



**వనపర్తి ప్రతినిధి,జులై 23 ప్రభాతవార్త:** వన మహోత్సవంలో భాగం గా ప్రతి ఇంటికి ఇచ్చే మొక్కలు పళ్ళ మొక్కలు అయి ఉండాలి అన్ని జిల్లా ఇంచార్జీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. మంగళవారం ఉదయం జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో వన మహోత్సవం కార్యక్రమం పురోగతి పై వెబ్ ఎక్స్ ద్వారా సమీక్ష నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం వనపర్తి జిల్లాలో 18 లక్షల 39వేల మొక్కలు నాటివాటిని సంరక్షంచేందుకు లక్ష్యంగా పెట్టుకో వడం జరిగిందన్నారు.ఇందులో గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా 10 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యం నిర్దేశించగా ఇరిగేషన్ శాఖకు 2 లక్షల మొక్కలు, మున్సిపాలిటీ, పంచాయతీ రాజ్ ద్వారా మిగిలిన మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు గ్రామీణభివృద్ధి, అటవీ శాఖ తప్ప మిగిలిన శాఖలు పెద్దగా లక్ష్యాలు సాధించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కలు నాటేం దుకు వాతావరణం బాగా అనుకూలంగా ఉన్నందున వెంటనే స్థలాలు గుర్తించి పెద్దమొత్తంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా ప్రతి ఇంటికి ఇచ్చే మొక్కలు పళ్ళ మొక్కలుఅయి ఉండాలని పంచాయతీరాజ్ శాఖ అధికారి ఆదేశించారు. జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, తహశీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు,ఎంపీఓ లు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటా ఇన్నోవేటర్ మంచి వేదిక

- గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు



**గద్వాల,జులై23 ప్రభాతవార్త:** ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా ఇన్నో వెటర్ 2024 కార్యక్రమం ద్వారా వినూత్నంగా ఆలోచించే వారికి ఇన్నోవేటర్ మంచి వేదిక అని అదనపు జిల్లా కలెక్టర్ నర్సింగరావు అన్నారు. ఈ సందర్భంగా ఇంటింటా ఇన్నోవెటర్ 2024 కార్యక్రమం పోస్టర్ ను ఆవిష్కరించారు. వయసు, విద్యతో సంబంధం లేకుండా ఇందులో ఎవరైనా పాల్గొనవచ్చని వారి యొక్క ప్రతిభని చాటుకో వడానికి ముఖ్య వేదిక అని ఆయన అన్నారు. ఈ పోటీలో ఎవరైనా పాల్గొని తమ నూతన ఆలోచనలను ప్రదర్శిస్తూ ప్రజలకు ప్రయోజన కరంగా ఉండాలని తెలిపారు. ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమం నిర్వ హిస్తున్నట్లు అందులో ఎంపికైన వారికి స్వాతంత్ర దినోత్సవం పురస్క రించుకుని ఎంపికైన వారికి బహుమతులు ఆవిష్కరణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం ను అందుబాటులోకి తెచ్చే విధంగా అధికారులు అందరూ వారికి సలహాలు సూచనలు చేయాల్సిన అవసరం ఉందని, కావున ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్ర మాన్ని ప్రతి గ్రామం లోని ప్రతి గడపకు, ప్రతి ఇంట్లో ప్రతి ఒక్కరికీ చేరే విధంగా ప్రత్య క్షంగా పరోక్షంగా అనగా పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించి గ్రామీ ణ ప్రాంతాల్లో రైతు వేదికల ద్వారా, పంచాయితీ కార్యదర్శులు గ్రామ సభల ద్వారా వివరిస్తూ అత్యధిక ఆవిష్కరణకు మన జిల్లా నుండి నమోదయ్యే విధంగాచొరవ తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికా రులు అందరికీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఓ వెంకట్‌రెడ్డి, అన్ని మండలాల ఎంపీడీఓ, ఏపీఎంలు, ఎంపిఓలు పాల్గొన్నారు.

## అధ్వానంగా మారిన మంగంపేట రోడ్డు

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు



**మల్దకల్ జులై 23 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని మంగంపేట గ్రామంలో రోడ్ల పరిస్థితి చాలా దయనీయంగా మారింది. దీంతో ఆశావర్కర్ ప్రెగ్నెన్సీ వాళ్లను గవర్నమెంట్ హస్పిటల్ కొరకై తీసుకువెళ్లడానికి 102 అంబులెన్స్‌ని పిలవగా రోడ్డు మధ్యలోనే ఇరుకుపోవడం జరిగింది. దీంతో ఆశావర్కర్ దగ్గర ఉండి జెసిబిని పిలిపించుకుని 102 అంబులెన్స్‌ను బయటికిలాగడం జరిగింది.కాబట్టి ఇప్పటికైనా అధికారులు స్పందిం చి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# మొక్కలను తల్లితో సమానంగా చూసుకోవాలి

- వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



వన మహోత్సవంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**వనపర్తి ప్రతినిధి జులై 23 ప్రభాతవార్త :** వన మహోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, ఐపీఎస్ పేర్కొన్నారు. చెట్లు లేకపోతే భవిష్యత్తులో దుర్భర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్రకృతిని పరి రక్షించుకునేందుకు అందరూ ముందుకు రావాలి వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ మొక్కలు నాటారు. చెట్లు ఉంటే వర్షాలు పుష్కలంగా కురుస్తాయన్న విషయాన్ని గ్రహిస్తే భవిష్యత్తు తరాలకు మనం మంచి చేసిన వాళ్లమవు తామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ విషయం గుర్తు పెట్టుకోవాలని సూచించారు. చెట్లు, అడవులు లేకపోతే వర్షాలు పడక, పంటలు పండక చాలా దుర్భర పరిస్థితులు ఎదుర్కోవలసి వస్తుందని వివరించారు. నాటిన మొక్కలను తల్లితో సమానంగా కాపాడుకోవాలని సూచించారు. ప్రకృతిని పరిరక్షించుకునేందుకు అందరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీశ్రీరామదాసు తేజవతి, వనపర్తి డిఎస్పి జై వెంకటేశ్వర రావు, డి సి ఆర్ బి డి ఎస్ పి కృష్ణ కిషోర్, వనపర్తి మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్, కౌన్సిలర్లు స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ ముని సి సి ఎస్ సి ఐ రవి పాల్, వనపర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగభూషణం, జిల్లా ఎస్ఐలు పోలీస్ సిబ్బంది, వనపర్తి లారీ అసోసియేషన్ వారు ఆటో అసోసియేషన్ వారు అనూస్ కాలేజి, మైనార్టీ గురుకుల కాలేజి వివిధ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో ఉండాలి

- ప్రతి కేసును పారదర్శకంగా విచారణ చేపట్టి నిర్ణీత సమయంలో ఛేదించాలి
- జిల్లా పోలీసు అధికారులతో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు




పోలీస్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాస్‌రావు

**గద్వాల,జులై 23 ప్రభాతవార్త:** జిల్లాలో ఆయా పోలీస్ స్టేషన్‌ల పోలీస్ అధికారులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రాపర్టీ కేసులలో అలసత్వం చూపకుండా నిర్ణీత సమయంలో చేదించాలని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు పోలీస్ అధికారులను ఆదేశించారు. సైబర్ నేరా లకు సంబంధించి 25000 ఆపై డబ్బులు పోగొట్టుకున్న సైబర్ నేరాలపై ఎఫ్ఐఆర్ నమోదు చెయ్యాలని, ఫ్రిజ్ అయిన అమౌంట్‌ను కోర్టు అను మతి ద్వారా తిరిగి బాధితులకు అందజేయాలని అన్నారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రుణమాఫీని సైబర్ నేరగాళ్ల అవకాశంగా తీసుకుని మోసాలకు పాల్పడుతున్నారని, మోసపోకుండా ఉండేందుకు సైబర్ నేరా లకు గురైన వెంటనే 1930 కు సమాచారం ఇచ్చుట వాటిపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అధికారులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, విజిబుల్ పోలీసింగ్‌ను మరింత పెంచాలని ఆదేశించారు. దొంగతనం కేసులను చెదించడం లో ప్రతిభ కనబరిచిన సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ రంజిత్, కానిస్టేబుల్స్ చందు, రామకృష్ణ, ఇస్మాయిల్‌లను జిల్లా ఎస్పీ ఒక్కొక్కరికీ 2000 రూపాయల క్యాష్ రివార్డు అందజేసి అభినందించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీకె.గుణశేఖర్, డిఎస్పి కె.సత్యనారాయణ,గద్వాల్ అలంపూర్, శాంతి నగర, సిఐలు బీమ్‌కుమార్, రవి బాబు, టాటా బాబు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల ఎస్సైలు, డీసీఆర్బీ,సిబ్బంది, ఐటీసెల్ సిబ్బంది ఉన్నారు



## రైతాంగాన్ని నిరాశ పర్చిన కేంద్ర బడ్జెట్

● కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాస్‌రెడ్డి



**కొత్తకోట,జులై23 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం 2004-25 పార్లమెంటులో ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ సమర్పించిన బడ్జెట్ 140 కోట్ల దేశ ప్రజలకు ఆహార ఉత్పత్తి చేసి అందిస్తున్న అన్నదాతలకు వ్యవసాయ రంగా నికి ఆదాయం కలిగించే లాగా కాకుండా మాటల ఊరుటనిచ్చే బడ్జెట్‌గా ప్రవేశ పెట్టారని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. రైతుల ఆదాయం పెంచే విధంగా కానీ ఎరువులు రాయితీలు మౌలిక సదుపాయాల అభివృద్ధి వాటిపై రైతాంగానికి బడ్జెట్లో ఎక్కువ నిధులు కేటాయించలేదని అన్నారు. అదేవిధంగా పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి ఎనిమిది మంది ఎంపీలకు ఇచ్చిన తెలంగాణ ప్రాజెక్టులకు నిదులు కేటాయిం చలేదు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేని ప్రభుత్వం అని ఎద్దేవా చేశారు. మూడోసారి అధికారంలో వచ్చిన తర్వాత కూడా మోడీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రైతుల ఆదాయం పెంచేం దుకు ఆసక్తి చూపలేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లోవ్యవసాయ అనుబంధ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పి కేవలం 1.52లక్షల కోట్లు కేటాయించడం విచారకరమన్నారు. ప్రధాని మోడీ గత రెండు పార్లమెంట్ ఎన్నికలలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని హామీ ఇచ్చి మూడోసారి ప్రభుత్వంలో వచ్చి కొత్త బడ్జెట్‌లో రైతాంగం ఎదు ర్కొంటున్న సమస్యలు, పంటలకు కనీసం మద్దతు ధరల సమస్యను పరిష్క రించే దిశగా దేశ రైతులు ఎంతో ఆశతో ఎదురుచూసిన కేంద్రం ప్రభుత్వం చర్యలు తీసుకోలేక పోయందని తెలిపారు.పంటలకు కనీస మద్దతు ధరలు పెంచాలని, ఎంఎస్పీకి చట్టబద్దత కల్పించాలని రైతులు ఉద్యమాలు చేసిన ఈ బడ్జెట్‌లో చట్టబద్దత కల్పించకపోవడం విడ్డురంగా ఉందని అన్నారు. ప్రధాన పంటలకు కనీసం మద్దతు ధరలు పెరగాలని రైతులు ఆశించారు కానీ దానిపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించలేదని చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మన వ్యవసాయ రంగం ఇంకా వెనకబడే ఉందని సాగు నీరు, ఎరువులు, విద్యుత్,వ్యవసాయ పరికరాల వంటి వాటిపై సబ్సిడీలతో పాటు వ్యవసాయానికి పన్ను మినహాయింపు ఇవ్వలేదని చెప్పారు. వ్యవసా య రంగంలో మరిన్ని విధానపరమైన సంస్కరణలకు అవకాశం ఉన్న కేంద్ర ప్రభుత్వం చేయలేకపోవడం సబబు కాదన్నారు.ఆహార ద్రవ్యోల్బణ నియం త్రణ, రైతుల పంటలకు సరైన గిట్టుబాటు ధరల కల్పన, చిన్న కమతాల సమస్య పరిష్కారం మన వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యను నివారించలేక పోయిందని తెలిపారు. పంటలకు కనీస మద్దతు ధరలు పెంచి ఎంఎస్పీకి చట్టబద్దత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఆత్మకూర్ బస్టాండ్‌ను తనిఖీ చేసిన ఆర్ఎం



ఆత్మకూర్ బస్టాండ్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్ఎం శ్రీదేవి

**ఆత్మకూర్ జులై 23 ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూర్ పట్టణంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాన్ని మంగళవారం రోజు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ శ్రీదేవి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. బస్టాండ్‌లో బస్సుల వేళలను ఉద్యోగుల రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించి బస్టాండ్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్టాండ్ పరిసర ప్రాంతంలో అపరిశుభ్రంగా ఉండడం చెత్త పేరుకుపోవడం మురుగునీరు విలువ ఉండడం పట్ల రీజనల్ మేనేజర్ ఆర్టీసి సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల వేళలను ఎప్పటికప్పుడు ప్రయాణికులు అందుబాటులో ఉంచుతూ ప్రయాణికుల సేవలే పరమావధిగా ఆర్టీసీ కార్మికుల పని చేయాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు.

## పోతులమడుగు పంచాయతీ కార్యదర్శికి సన్మానం



**భూత్పూర్,జూలై 23,ప్రభాతవార్త:** భూత్పూర్ మండలం పోతులమడుగు గ్రామపంచాయతీకి నూతన కార్యదర్శిగా కృష్ణకుమారి నియమితులయ్యారు. నూతనంగా జీపీ సెక్రటరీగా వచ్చిన కృష్ణకుమారిని గ్రామానికి చెందిన మాజీ సర్పంచి హరియా నాయక్,మాజీ డిప్యూటీ సర్పంచి పాలరాములుతో పాటు నాయకులు కోట్ల కిష్టయ్య,రామకృష్ణారెడ్డి, తిరుపతయ్యగౌడ్,చెన్నయ్య తదితరులునూతనసెక్రటరీకృష్ణకుమారినిపూలమాలలు,శాలువలతో సన్మానించారు.

## బోనమెత్తిన పల్లెలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

**చిన్నచింతకుంట,జులై 23 ప్రభాతవార్త:** ఆషాడ మాసంలో పోచమ్మ దేవతకు బోనాల పండగను మంగళవారం మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు ఉంద్యాల, మద్దూరు, అల్లిపూర్, దమగ్నాపూర్ తదితరగ్రామాల్లో పోచమ్మ బోనాలపండగను వైభవంగా జరుపుకున్నారు. కొత్త మట్టికుండకు పసుపు, కుంకుమతో పాటు వేపకొమ్మలతో అలంకరించిన బోనాన్ని మహిళలు చిన్నారులు తలపై ఉంచుకొని ఊరేగింపుగా పోచమ్మ గ్రామ దేవత ఆలయం చుట్టూ బోనంతో భక్తులు ప్రదక్షిణ చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోచమ్మ బోనాల పండగను ఆయా గ్రామాల ప్రజలు సంతోషంగా జరుపుకున్నారు.

## కొనసాగుతున్న కంటి వైద్య శిబిరం



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**వెల్దండ, జూలై23 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరం మంగళవారం 5వ రోజుకు చేరుకుంది. వైద్య శిబిరానికి ప్రజలు పెద్ద ఎత్తున చేరు కొని కంటి పరీక్షలు నిర్వహించుకుంటున్నారు. ఇప్పటి వరకు 1200 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరాన్ని ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు సుంకిరెడ్డి కృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చిందని, 1200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 700 మందికి కంటి అద్దాలను పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. 96మందికి కంటి శుక్లాలకు రెఫర్ చేశామని, వీరితో పాటు 140 మంది చెన్నై శంకర్ నేత్రాలయ ఆసుపత్రికి రెఫర్ చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 27వ వరకు కొనసాగుతుందని, ఇట్టి అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నరేందర్‌గౌడ్, మల్లయ్య, రమేష్ నాయక్, కొండలుయాదవ్, రమేష్, హసన్, రాము, శ్రీపతి, శివ, కళ్యాణ్, మహేష్ తదితరులు ఉన్నారు.

# ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

● ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజ్ శ్రీనివాసరావు

**లింగాల,జులై 23 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొత్తకుంటపల్లి గ్రామంలో మంగళవారం సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంస్థ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఆవరణలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలన్నారు. రిజర్వ్ బ్యాంకు గుర్తించిన ఆర్థిక సంస్థల ద్వారా ఆర్థిక వ్యవహారాలను కొనసాగించాలని ఆయన కోరారు. బ్యాంకులో అందించే సేవింగ్స్ రుణ సదుపాయాలను భీమా పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలపడాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సెల్‌ఫోన్ వాడకంపై అవగాహన లేని వ్యక్తుల బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బును సైబర్ నేరగాళ్లు దోచుకుంటున్నారని ఆధార్, ఫోన్ నంబర్ ఓటిపిలను చెప్పకూడదని సూచించారు. ప్రతి గ్రామంలో నెలకు ఒకసారి ఈ అవగాహన సదస్సు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక సంస్థల్లో ఆర్థిక మోసాలు జరిగితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ బ్యాంకింగ్ అమ్ముడ్స్‌మెన్‌ద్వారా పరిష్కారం పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఎల్‌సిసి జనార్ధన్, సిఎఫ్ఎల్ కౌన్సిలర్లు ఎండి మన్సూర్, జె.రూపేష్, తాజా, మాజీ సర్పంచ్ పర్వతాలు, సింగిల్ విండో డైరెక్టర్ బాలరాజుగౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జైపాల్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ రాజీవ్, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ రైతులు తదితులు పాల్గొన్నారు.

# గద్వాల, వనపర్తి బస్సులను పలు స్టేజీలలో నిలపాలి



వేముల, ధర్మవరం స్టేజిలలో వనపర్తి డిపో బస్సును నిలపాలని మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

**ఇటిక్యాల జులై 23 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా ఆర్టిసి డిపో నుండి కర్నూలుకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులు ఇటిక్యాల మండల పరిధిలోని జింకలపల్లి, వేముల,ధర్మవరం గ్రామాల స్టేజిలలో బస్సులు నిలుపుదల చేయకపోవడంవల్ల ఉద్యోగులు గ్రామాల ప్రయాణికులు ఇబ్బందులు పడుతూ నిత్యం ప్రయా ణికులుపై స్టేజిలలో బస్సులు ఆపడం కోసం డ్రైవర్లు, కండక్టర్లతో బస్సులు ఆపకపోవడం వలన ప్రయాణికులు వాగ్వివాదానికి దిగే పరిస్థితి నెలకొంటుంది. అలాగే కర్నూల్ నుండి వనపర్తికి వెళ్లే డిపో బస్సులు కానీ వల్లూరు, జింకలపల్లి, బీచుపల్లి పుణ్యక్షేత్రం వద్ద ఉన్న స్టేజిలలో ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు నిలపకపోవడం వలన ఈ స్టేజిలలో నిలుపుదల చేయాలని డ్రైవర్లతో గొడవలు పడాల్సిన పరిస్థితి కనిపిస్తుంది. మంగళవారం నడువు వనపర్తి డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు కర్నూలు నుండి వనపర్తికి బయలుదేరగా అందులో ప్రయాణించిన ప్రయాణికులు బీచ్‌పల్లి పుణ్యక్షేత్రం వద్ద బస్సు ఆపాలని డ్రైవర్‌ను కోరగా ఇక్కడ స్టాప్ లేదని పెబ్బేరు టికెట్ తీసుకుంటేనే ఇక్కడ బస్సును ఆపుతామని డ్రైవర్ ప్రయాణికులు తో సమాధానం ఇస్తున్నారు. అంతేకాక పలుమార్లు గద్వాల ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వనపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్‌కు నాయకులు ప్రయాణికులు ఫిర్యాదులు చేసిన ప్రయోజనం లేకుండాపోతుంది.మండల పరిధిలోని పై స్టేజిలలో ఆర్టీసీఎక్స్‌ప్రెస్ బస్సులను డిపో మేనేజర్లు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే బీచుపల్లి పుణ్యక్షేత్రం వద్ద కూడా వనపర్తి డిపోకు చెందిన బస్సులు ఆపేలా చూడాలని ప్రయాణికులు వాపోతున్నారు.

# కొత్త రిజిస్ట్రేషన్లు నిబంధనలకు అనుగుణంగా ఉండాలి

గర్భస్థ శిశువు స్కానింగ్ చేయడానికి పి.సి.పి యాక్టు 1994ను పాటించాలి : జిల్లా ఇంఛార్జ్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్



ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి జులై 23 ప్రభాతవార్త:** ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నిస్టిక్ సెంటర్లు పి.సి.సి యాక్ట్ 1994కు లోబడి పని చేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. నిబంధనలకు అనుగుణంగానే కొత్త రిజిస్ట్రేషన్లు, రెన్యువల్ చేయడం జరుగుతుందని తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వనపర్తి జిల్లాలో కొత్తగా ఆసుపత్రులు, ఉన్న వాటికి రెన్యువల్ అనుమతులు మంజూరు చేసేందుకు జిల్లా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటు చేయగా జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ అధ్యక్షతన వహించారు. కొత్తగా 3 ప్రైవేట్ ఆసుపత్రులు, 5 క్లినిక్ లు, మిగిలినవి రెన్యువల్ కు కలుపుకొని 23 దరఖాస్తులు, కొత్తగా ఆయుష్ క్లినిక్ లో కొరకు (9) దరఖాస్తులు రాగా వాటిని నిబంధనల మేరకు సమర్పించిన డాక్యుమెంట్లు, ఫోటోలను కమిటీలో క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ గర్భస్థ శిశువు స్కానింగ్ చేయడానికి పి.సి.పియాక్టు 1994ను పాటించాలని సూచించారు. లేని పక్షంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆసుపత్రుల ప్రతిపాదనలు తిరస్కరించి నిబంధనలకు లోబడి ఉన్న 15 ఆసుపత్రులకు కమిటీ ద్వారా ఆమోదం తెలిపారు. ఆయుష్ క్లినిక్ కు వచ్చిన 9 ప్రతిపాదనలకు కమిటీ ఆమోదం తెలిపింది. కమిటీ మెంబర్ కన్వీనర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. జయచంద్ర మోహన్, డా.భాస్కర్ ప్రభాత్, ఇతర డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సియంఆర్ ధాన్యాన్ని నిర్ణీత గడువులో అప్పగించాలి

## వనపర్తి అదనపు కలెక్టర్ రెవెన్యూ యం.నగేష్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రెవెన్యూ యం.నగేష్

**వనపర్తి ప్రతినిధి జులై 23 ప్రభాతవార్త :** కేంద్ర ఆహార సంస్థకు ఇవ్వాల్సిన సి.యం.ఆర్ ధాన్యాన్ని నిర్ణీత గడువులో అప్పగించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ యం.నగేష్ ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం ఐ.డి.ఒ.సి సమావేశ మందిరంలో జిల్లాలోని మిల్లర్లతో ధాన్యం అప్పగింత పై సమీక్ష నిర్వహించారు. 2022-23 సంవత్సరానికి సంబంధించి మిల్లు వారీగా ఇవ్వాల్సిన ధాన్యం, 2023-24 సంవత్సరంలో అప్పగించాల్సిన ధాన్యం పై మిల్లు వారీగా యజమానితో సమీక్ష నిర్వహించారు. నిర్ణీత గడువులోగా ధాన్యం అప్పగించాలని అందుకు మిల్లు సామర్ధ్యం మేరకు పండించి ధాన్యం అప్పగించాలని సూచించారు. లేని పక్షంలో రెవెన్యూ రికవరి యాక్టు ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎఫ్.సి.ఐ నిబంధనల ప్రకారం ధాన్యం నాణ్యత ఉండాలని లేనిపక్షంలో ధాన్యం నిరాకరించడం జరుగుతుందన్నారు. అందువల్ల నాణ్యమైన ధాన్యాన్ని సిద్ధం చేసి ఎఫ్.సి.ఐ కి అప్పగించాల్సిందిగా ఆదేశించారు. పౌర సరఫరాల శాఖ నుండి అకౌంటెంట్ బాలు నాయక్, జిల్లాలోని రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న రైస్ మిల్లు యజమాన్లు

## ఎన్నికల హామీలు విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

షేక్ జహంగీర్ ఈఎక్స్ వక్స్ ఆస్తుల రక్షణ, కో ఆర్డినేషన్ కమిటీ



**వనపర్తి టౌన్ జులై23 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజల సంక్షేమం కొరకు పనిచేస్తామని చెప్పిన కాంగ్రెస్ వాటిని తుంగలో తొక్కిపేద ప్రజలను పట్టించుకోవడం లేదు. ఇల్లు లేని పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తా మని నమ్మించి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయించుకొనిఅధికారంలోకి వచ్చాక వారి ఊసేత్తకుండా కాలయాపన చేస్తుంది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వెంటనే ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులను గుర్తించి ప్రతిపాదన పంపాలి అలాగే త్వరగా లబ్దిదారులకు ఇందిరమ్మ గృహా లను నిర్మించాలి. వృద్ధులకు వికలాంగులకు వితంతువులకు పెంచుతామని చెప్పినపెన్షన్ వెంటనే అందజేయాలి.కాంగ్రెస్ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని అబద్ధ హామీలతో గద్దెనెక్కింది. ప్రభుత్వానికి పేదలపై ఎలాంటి చిత్తశుద్ధి లేదు వాళ్ళు కేవలం ఇచ్చిన గ్యారెంటీలను తూతూ మంత్రంగా అమలు చేయడం తప్ప 6 గ్యారెంటీలను అమలు చేయడం లేదు ప్రజలను మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి ప్రజలనట్టేట ముంచిన కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ ఇండ్లు, పెంచుతామన్న పెన్షన్లపై వెంటనే చర్యలు తీసుకోవాలిని డిమాండ్ చేస్తున్నాం అని పత్రిక సమావేశంలో మాట్లాడారు.

## స్టేట్ ర్యాంకర్‌కు ఆర్థిక చేయూత



విద్యార్థినులను ఆర్థిక సహాయం అందజేస్తున్న హెచ్ఎం నిర్మల

**కల్వకుర్తిటౌన్, జూలై 23 ప్రభాతవార్త:** కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న పేదింటి ఆడబిడ్డలు ఆదిలక్ష్మి, అమూల్య, దీప్తి, స్టేట్ ర్యాంకులు సాధించిన సందర్భంగా ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి ద్వారా సమాచారం తెలుసుకున్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం నిర్మల కళాశాలకు విచ్చేసి రూ.25వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా పేదరికాన్ని లెక్క చేయకుండా చక్కగా చదివి కల్వకుర్తి పట్టణానికి, మన కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చేలా కృషి చేసినందుకు విద్యార్థినులను హెచ్ఎం నిర్మల అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వేణు, అధ్యాపకులు కేవీ, సదానందంగౌడ్, శోభ, రాజేష్, రమాకాంత్, మహబూబ్‌అలీ, మల్లేష్, గిరిబాబు, పరశురాం, శ్రీనివాస్, లక్ష్మయ్య, సంతోష్‌గౌడ్, బాలయ్య తదితరులు ఉన్నారు.

# అమిస్తాపూర్‌లో ఘనంగా బోనాల పండుగ

◆ బోనాల ఉత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు



బోనాల ఉత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు కేసిరెడ్డి శ్రీనివాసరెడ్డి,లిక్కి నవీన్‌గౌడ్

**భూత్పూర్,జూలై 23,ప్రభాతవార్త :** ఆషాడమాసం సందర్భంగా భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని అమిస్తాపూర్‌లో మంగళవారం ఘనంగా బోనాలు ఉత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఇతర కాంగ్రెస్ నేతలు హాజరై ఉత్సవంలో పాల్గొన్నా రు.ఈ సందర్భంగా మహిళలు ఘటాలను ఊరేగింపుగా మోసి పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించారు.డప్పుల వాయిద్యాలు,పోతరాజుల చెర్నాకొలల విన్యాసాలు చూపరుల్ని ఆకట్టుకున్నాయి.వర్షాన్ని సైతంలెక్కచేయకుండా మహిళలు, బాలికలు, గ్రామస్తులు ఘటాల ఊరేగింపు నిర్వహించారు.బోనాల పండుగ సందర్భంగా అమిస్తాపూర్‌పట్టణంలో సందడినెలకొంది.ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు భూపతిరెడ్డితో పాటు నాయకులు హరియానాయక్, మచ్చేందర్,పవన్,ఆగిరిరవి,వాసన్‌గౌడ్,తమన్నగౌడ్,నర్సింహులు,కిట్టు పాల్గొన్నారు.ఎలాంటిఅవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భూత్పూర్ పోలీస్ ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

## మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తి రిమాండ్

**లింగాల,జులై 23 ప్రభాతవార్త:** మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై జగన్మోహన్ తెలిపారు. లింగాల మండల పరిధిలోని కొత్తకుంటపల్లి గ్రామానికి చెందిన ఏదుల రాముడు అదే గ్రామానికి చెందిన మహిళతో గతకొన్ని రోజుల క్రితం అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయంలో పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి కోర్టుకు హాజరు కాకపోవడంతో అచ్చంపేట మెజిస్ట్రేట్ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. మంగళవారం లింగాల పోలీసులు ఏదుల రాముడును అదుపులో తీసుకొని అచ్చంపేట మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా 15 రోజుల పాటు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## ప్రమాదకర ఇండ్లను పరిశీలించిన ఎస్ఐ



మట్టి మిద్దె ఇండ్లను పరిశీలిస్తున్న ఎస్ఐ

**వెల్దండ, జూలై 23 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలో ప్రమాదకరంగా ఉన్న నివాసాలను మంగళవారంఉదయం ఎస్ఐ కురుమూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశానుసారం ఇటీవల కురు స్తున్న భారీ వర్షాల వల్లతడిసి ప్రమాదకరంగా ఉన్నటువంటి నివాసాలను గుర్తించి వారికి తగు సూచనలు చేశారు. ముఖ్యంగా మట్టి మిద్దె కలిగిన ఇండ్లలో నివసించే ప్రజలు అప్రమత్తంగాఉండాలన్నారు.అత్యవసర సమయాల్లో 100కు సమాచారమివ్వాలన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న 40 మంది రిటైర్డ్ ఉద్యోగులు



**ఇటిక్యాల జులై 23 ప్రభాతవార్త:** అల్లంపూర్ పట్టణంలో వెలసిన ఐదవ శక్తిపీఠం జోగులాంబ బాల బ్రహ్మేశ్వరి స్వామి ఆలయాన్ని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్,రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి దాదాపు 40 మంది రిటైర్డ్ ఉద్యో గులు మంగళవారం అల్లంపూర్ కు చేరుకుని అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని ఆలయంలో పూజలు నిర్వహించారు. వారికి ఆలయ మార్యాతలతో పూజలు చేయించి సత్కరించారు ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులకు స్థానిక రిటైర్ ఉద్యోగ సంఘం నాయకులు సదానందమూర్తి కేశవచారి ఏసన్న తదితరులు వారికి స్వాగతం పలికారు.

## తెలంగాణ ఇంటర్నేషనల్ మోడల్ స్కూల్‌కు స్థల సేకరణ



రాయిచేడు శివారులో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు, నాయకులు

**ఉప్పునుంతల,జులై 23 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తెలంగాణ ఇంటర్నేషనల్ మోడల్ స్కూల్‌కు నిర్మాణానికి మంగళవారం మండలంలోని రాయిచేడు శివారులో స్థల సేకరణ కోసం పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు స్థానిక ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ సూచనల మేరకు ఇంటర్నేషనల్ మోడల్ స్కూల్ కోసం కావలసిన 20 ఎకరాల భూమిని అధికారులు, అనేక నాయకులు పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యా వైద్యం ప్రత్యేక దృష్టిలో భాగంగా రాయిచేడు శివారులో ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 61లో సమారుగా 24 ఎకరాల భూమిని స్థానిక తహసిల్దార్ శ్రీకాంత్ మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, సర్వేయర్ సత్యనారాయణ వారితోపాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, తిప్పర్తి నరసింహారెడ్డి,నరసింహారావు,అచ్చంపేట మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు నరసయ్యయాదవ్,యూత్ కాంగ్రెస్ ఇంఛార్జి శేఖర్ గౌడ్,కొత్తశ్రీనివాస్‌రెడ్డి,సూరంప్రశాంత్‌రెడ్డి, రాయిచేడు గ్రామ కమిటీ నాయకులు ఆనంద్,మల్లయ్య,సాయిబాబు, బాలునాయక్, శ్రీను, నవీన్ తదితరులున్నారు.

## రికార్డులు తనిఖీ చేసిన శిక్షణ కలెక్టర్



**మక్తల్,జులై 23 ప్రభాతవార్త:** మండలంలోని టేకులపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం నారాయణపేట శిక్షణ కలెక్టర్ గరేమానురుల్లా సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను ఆమె పరిశీలించారు. అలాగే ప్రజలకు అందుతున్న పలు పథకాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ గోవిందరావు, ఎంపిఓ రహమతోద్దిన్,మాజీఎంపిటిసి జి.బలరామ్‌రెడ్డి,ప్రధానోపాధ్యాయులుభార్గవి పాల్గొన్నారు.

## గుట్కా ప్యాకెట్ల పట్టివేత

**మక్తల్,జులై 23 ప్రభాతవార్త:** మక్తల్ మండలంలోని జక్లేర్‌లో మంగళవారం నిషేధిత గుట్కా ప్యాకెట్లను పట్టుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై.భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు. సామన్‌పల్లికి చెందిన నరెందర్‌శెట్టి అనే వ్యక్తి జక్లేర్‌లోని తన కిరాణా దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన గుట్కా, అంబర్ జర్దా ప్యాకెట్లను పట్టుకొని సీజ్ చేసినట్లు చెప్పారు. వీటి విలువ రూ.2,89,055లు ఉంటుందని ఆయన తెలిపారు. మండలంలో ఎక్కడైనా గుట్కా ప్యాకెట్లను విక్రియస్తున్నట్లయితే తమకు సమాచారం అందించాలన్నారు.

## చేనేత కార్మికుడికి ఆర్థిక సాయం

**అయిజ జులై23,ప్రభాతవార్త:** పట్టణంలోని భరత్ నగర్ కాలనీకి చెందిన చేనేత కార్మికుడు పరమేష్ ఆర్థిక ఇబ్బందులతో మంగళవారం ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జరిగింది ఈవిషయం తెలుసుకున్న ఆయన క్లాస్ మెంట్స్ ఆయన ఆర్థిక ఇబ్బందులను గుర్తించి 25 వేల రూపాయలు దహన సంస్కారాల నిమిత్తం కుటుంబ సభ్యులకు అందించారు అంతకుముందు వారిభౌతిక గాయానికి మృతుని మిత్రులు పూలమాలలు వేసి నివాళులర్పించారు

## అనారోగ్యంతో గణిత ఉపాధ్యాయుడి మృతి

**అయిజ జులై 23,ప్రభాతవార్త:** తీవ్ర అనారోగ్యంతో రెండు రోజుల క్రితం రాయచూరులో నిస్సాయతస్థితిలో పట్టణానికి చెందిన పి.రవి 55 ప్రైవేట్ గణిత ఉపాధ్యాయుడు మరణించారు.గత 6 నెలలుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న పి.రవి భార్య పిల్లలు ఎవరు లేకపోవడంతో ఉన్న తమ్ముడు,అన్నకు ఎవరికి భారం కాకూడదని అనుకున్నాడో ఏమో గత వారం గురువారం రోజున ఎవరికి చెప్పకుండా ఉదయం 5గం॥లకు ఇల్లు వదిలి వెళ్లిపోయిన గత రెండు రోజుల క్రితం రాయచూరులో ఆయాసంతో పడిపోయి పరణించడంతో అక్కడ అధికారులు మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. ఆ రోజు నుండి ఆయన కోసం కుటుంబ సభ్యులు వెతకగా ఈ విషాద వార్త తెలిసింది.తను డిగ్రీ చదివిన వెంటనే పట్టణంలో అనేక మంది విద్యార్థులకు ట్యూషన్స్ చెబుతూ పట్టణంలో అనేక ప్రైవేట్ పాఠశాలలో ఉత్తమ గణిత ఉపాధ్యాయుడుగా విద్యార్థులు గుర్తు చేసుకుని ఆయన నివాళులర్పించారు .

## ఘనంగా పోచమ్మ ఉత్సవాలు



ఆత్మకూరు పట్టణంలో పోచమ్మ తల్లికి మొక్కులు సమర్పించుకుంటున్న మున్సిపల్ చైర్ పర్సన్

**ఆత్మకూర్ జులై 23 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంతో పాటుగా మండలంలోని వివిధ గ్రామాలలో మంగళవారం రోజు గ్రామ దేవతలుగా భావించే పోచమ్మ తల్లి ఉత్సవాలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆత్మకూరు పట్టణంలో మధ్యాహ్నం ఒంట ిగంటకే మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రి ఉదయకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున్న మహిళలు బోనమెత్తి డోలు వాయిద్యాలతో పోచమ్మ దేవాలయానికి చేరుకుని నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని జూరాలకత్తిపల్లి, ఆరేపల్లి, తోంపల్లి, వీర రాఘవపురం, మేడిపల్లి, తదితర గ్రామాలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పోచమ్మ దేవతకు మొక్కులు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమాలలో కాంగ్రెస్‌పార్టీ, టిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అమరచింతలో ఘనంగా బోనాల పండుగ

**బోనాల ఉత్సవాలకు హాజరైన పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్**



అమరచింతలో పోచమ్మ దేవతకు ప్రత్యేక పూజలు

**అమరచింత జులై 23 ప్రభాతవార్త:** అమరచింత మున్సిపల్ కేంద్రంలో శ్రీకృష్ణ నగర్‌లో వెలిసిన శ్రీ పోచమ్మ బోనాల పండుగ ఉత్సవాలు మంగళవారం భక్తులు భారీగా చేరుకొని శ్రీ పోచమ్మ దేవతకు మొక్కు బడులు చెల్లించుకున్నారు. బోనాల పండుగ సందర్భంగా శ్రీ పోచమ్మ దేవతకు ఉదయము అభిషేకం నైవిధ్యంతో ఘనంగా పూజలు నిర్వహించారు. అలాగే పట్టణంలోని శ్రీ పోచమ్మ తల్లికి బోనాల సమర్పించుకొనుటకు పట్టణంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. బోనాల పండుగ ఊరేగింపులో పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజుగౌడ్ హాజరై శ్రీ పోచమ్మ దేవత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్, మంగమ్మ నాగభూషణం గౌడ్, డిసిసి జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్, శ్రీ పోచమ్మ దేవత ఆలయ కమిటీ అధ్యక్షులు, పోసిరి విష్ణు, తాటికొండ రమేష్, జింక రవి, అలాగే కాంగ్రెస్ పార్టీ పట్టణ, అధ్యక్షులు అరుణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, బీసీరెడ్డి, హనుమంతు నాయక్, పుర ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దేవరకద్రలో ఘనంగా పోచమ్మ బోనాల వేడుకలు

**దేవరకద్ర, జులై23 ప్రభాతవార్త:** దేవరకద్రలో గ్రామదేవత పోచమ్మబోనాల పండుగను మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. బోనాలపండుగను ప్రతి ఏడాది పట్టణ ప్రజలు కలసి కట్టుగా సాంప్రదాయ రీతిలో అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దఎత్తున అలంకరించిన బోనం కుండలను తీసుకొని పట్టణ పురవీధుల గూండా పోచమ్మగుడి వద్దకు ఊరేగింపుగా చేరుకొన్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మద్య ఈ బోనాల ఊరేగింపు ముందుకు కదిలింది. పెద్దబోనం కుండతో అమ్మవారి గుడి చుట్టూ ప్రదిక్షణలు నిర్వహించారు. అనంతరం బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే బోనం కుండలతో మహిళలు అమ్మవారి గుడి చుట్టు ప్రదిక్షణలు నిర్వహించారు. అనంతరం పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేధ్యాలు సమర్పించారు. దీంతో పోచమ్మగుడి ప్రాంతం జనసంద్రాన్ని తలపించింది. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు ఈ సారి హైలెట్‌గా నిలిచాయి. వారి విన్యాసాలుచూపరులను ఎంతగానోఆకట్టుకొన్నాయి. ఉదయం కురుమయాదవులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి పరిగెత్తుకొని పోయి తమతమ గొర్లపై ఆ అంబలిని చల్లుకొన్నారు. ఈ విదంగా అమ్మవారి అంబలిని గొర్లపై చల్లితే గొర్లకు ఎటువంటి రోగాలు రావని వారి విశ్వాసం. బోనాల వేడుక సందర్భంగా అమ్మవారి గుడిని రకరకాల పూలు, వేపాకు తోరణాలు, రంగురంగుల విద్యుత్ బల్బులతో శోభాయమానంగాఅలంకరించారు. పోచమ్మ అమ్మవారినికూడ సర్వాంగ సుందరంగా అలంకరించారు. దీంతో అమ్మవారు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణప్రజలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. బోనాల వేడుకతో దేవరకద్ర భక్తిపారవశ్యంతో పులకించిపోయింది. పండుగను పురస్కరించుకొని ఆడపడచులంతా పుట్టింటికి రావడంతో ప్రతి ఇల్లు వారితో కళకళలాడింది.

## భవసార్ క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో ఘనంగా బోనాల పండగ



**మక్తల్ టౌన్, జులై 23 ప్రభాతవార్త:** భవసార్ సమాజ్ తరపున 44వ ఆషాడ వనమహోత్సవ బోనాల పండగ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి భవ సార్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఉమేష్ జైతనె పాల్గొన్నారు. ఈ బోనాల పండగకు భవసార్ సమాజ్ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ పడ మటి ఆంజనేయస్వామి దేవాలయం నుండి శ్రీ భవాని మాత దేవాలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. భవాని మాత దేవాలయంలో తెల్లవారుజాము 6 గం.లకు అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పడమటి ఆంజనేయస్వామి దేవాలయంలో బోనాలు ఎత్తుకుని పట్టణంలో సాంస్కృతిక కార్యక్రమాలు చేస్తూ పెద్ద ఎత్తున శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి భవసార్ క్షత్రియ సమాజ్ సెక్రెటరీ రంగ్దల్ జీవన్‌రావు, కోశాధికారి నౌలే ఆనంద్, వైస్ ప్రెసిడెంట్‌గా క్షీరసాగర్, నారాయణరావు, బొడికెశివాజీరావు, జాయింట్ సెక్రెటరీగా పట్కే శోభన్‌బాబు, సులకే నరసింహారావు, యువ పరిషత్ బొడికె అంబదాస్ రావు, నీంకర్ శ్రీనివాసరావు, మహెంద్రకార్‌రాజేష్, బొడికే దామోదర్, మహేంద్ర కార్ అక్షయ్, బొడికె రాహుల్, చౌద్రిరాము పాల్గొన్నారు.

## వెంటనే డిఎ విడుదల చేయాలి



**ఉప్పునుంతల, జులై 23 ప్రభాతవార్త :** రెండున్నర ఏళ్లుగారాని డిఎలను వెంటనే విడుదల చేయాలని, పిఆర్సి గడువు ముగిసి ఏడాది అవుతుందని ఎస్‌టియు టిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీధర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పోకల సతీష్‌లు అన్నారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడుతూ విద్యా రంగానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలని మిగిలిపోయిన ఖాళీలను భర్తీ చేయాలని, గత రెండున్నర సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నఐదు డిఎలను సంవత్సరం గడిచిన రాని పిఆర్‌సి విద్యారంగానికి నిధులు పెంచి ఉపాధ్యాయులు దాచుకున్న జిపిఎఫ్ బకాయిలు విడుదల చేసి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. రకరకాల కారణాలతో ఆగిపోయిన పెండింగ్ బిల్లును ఈ బడ్జెట్‌లో చర్చించి తగినన్ని నిధులు కేటాయించాలని వారు కోరారు. ఇంకా బదిలీ జరిగి అదే బడిలో పని చేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లను సర్దుబాటు చేసి రిలీవ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా లెఫ్ట్ ఓవర్ వెకెన్సీస్‌లలో పదోన్నతులు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం పాఠశాలలను సందర్శించి సభ్యత్వాల నమోదు ప్రక్రియను ఉద్దేశించి మాట్లాడారు. వారితో పాటు అచ్చంపేట మండలం అధ్యక్షులు నందకిశోర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి నారాయణగౌడ్, జిల్లా కౌన్సిలర్లు ఒగ్గు సుదర్శన్, కొండవిక్రం, ఉపాధ్యక్షుడు భాస్కర్, సభ్యులు కవిత, మాధవి, పారిజాత తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో పడకేసిన పారిశుద్ధ్యం

**● అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ ● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు**



మంగంపేట, నెట్టెంపాడు గ్రామంలో రోడ్డు దుస్థితి

**గద్వాల జులై 23 ప్రభాతవార్త:** జిల్లాలోని 12 మండలాల పరిధిలో గల సుమారు 243 గ్రామాలలో పారిశుద్ధ్యంలోపంపై మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు మాజీ ప్రజాప్రతినిధులు ఎవరు కూడా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఇటు అధికారుల నుండి స్పందన కరువైందని ప్రజలు అంటున్నారు. జిల్లా మంత్రి జూపల్లి కృష్ణరావు, ఇంచార్జి మంత్రి దామోదర్ రాజ నర్సింహ, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్‌తో సహ పంచాయితీ రాజ్, పంచాయితీ ఆర్‌అండ్‌బి అధికారులు కూడా స్పందించి స్పందించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. ధరూర్, మల్దకల్ మండలంలోని నెట్టెంపాడు, మంగంపేట గ్రామాలలో ఎటు చూసినా అభివృద్ధి అంతా అస్తవ్యస్తంగా మారింది. ముందే వర్షాకాలం కావడంతో డ్రైనేజీ లోకి వెళ్లాల్సిన మురుగు నీరు మొత్తం రోడ్లపై పారుతున్నాయి. చర్యలు చేపట్టాల్సిన అధికారులు మాత్రం గ్రామాల వైపు కన్నెత్తి కూడా చూడని పరిస్థితి ఏర్పడింది. గ్రామాలలో, దోమల బెడద ఎక్కువై ఏ ఇంట్లో చూసినా దోమలు స్వైర విహారం చేసి ప్రజలను కాటు వేస్తుండడంతో గ్రామాల్లోని ప్రజలు తీవ్ర జ్వరాలతో డెంగ్యూ లక్షణాలతో బాధపడుతున్నారు. ప్రైవేటు దవఖానాలకు పోయి లక్షల్లో ఖర్చులు పెడుతున్నారు. ఇంత జరుగుతున్న గ్రామాల పంచాయితీల, పాలకవర్గ మాత్రం గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు చేపట్టడం లేదు. డ్రైనేజీ లోపంతో మురికి నీరు నిండుకుండలా నిండుకోని రోడ్లపై పారుతున్న పూడిక తీయకపోవడంతో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో కలుషితమయ్యే ప్రమాదం ఉందని, తమ గోడును వెల్లబోసుకుంటున్నారు. గ్రామాల్లో ఎస్సీ, బీసీ కాలనీలలో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. మురికి వాసన కంపుతో దుర్వాసన వెదజల్లుతుందని దోమలు పుట్టగొడుగుల పుట్టుక వస్తున్నాయని దయచేసి ఇట్టి విషయంపైన అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. చేసేది లేక గ్రామ ప్రజలు సొంతఖర్చులతో బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేసి ఎవరి వాళ్లే చల్లుకుంటున్నారు. అధికారులు గ్రామాన్ని సందర్శించకపోవడంతో పాటు ఇటు వైద్య బృందం కూడా పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తామే సొంత ఖర్చుతో బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేసి చల్లుకుంటున్నట్లు వారు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఈ గ్రామాన్ని సందర్శించి, సమస్యలు లేకుండా చూడాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

# చెరువులను తలపిస్తున్న ప్రధాన రహదారులు

**■ పాదచారులు నడవలేని దుస్థితి**



మొల్గర వద్ద దెబ్బతిన్న ఆర్‌అండ్‌బి రోడ్డు

**ఉప్పునుంతల, జులై 23 ప్రభాతవార్త:** వాహనాల తాకిడికి, అధిక శాతం రోడ్లు దెబ్బతిన్న ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల పాదచారులు నడవలేని దుస్థితి నెలకొంది. మండలంలో ప్రజా ప్రతినిధుల అలసత్వంతో అధికారులు ఇష్టానుసారంగా పనిచేస్తూ రోడ్లు దెబ్బతిని వర్షం వస్తే చెరువులను తలపిస్తున్న పట్టించుకున్న పాపాన పోలేదు. మండలంలోని మొలగర ప్రాంతంలో రోడ్లు అద్వాన స్థితిలో నెలకొన్నాయి. పిఎసిఎస్ వారి గోదాం సమీపంలో రోడ్డు కుంగి చెరువులా తలపిస్తున్నా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అదే విధంగా పంచాయతీరాజ్ రోడ్లపరిస్థితి దయనీయంగా మారింది. ఉప్పునుంతల నుంచి రాజానగరం వరకు వెళ్లే మార్గం నడవలేని పరిస్థితి నెలకొంది. కనీసం మార్గం గుండా మొరంపోసి వ్యవసాయదారులకు అందుబాటులో వచ్చే విధంగా చర్యలు తీసుకుంటే బావుంటుందని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. రైతులు ఈ రోడ్డుగుండా ఇరువైపులా రోడ్డును తొలగించుకుంటూ వ్యవసాయ సాగుకు అనువుగా తయారు చేసుకుంటు న్నారు. యంత్రాలతో రోడ్డును ఆక్రమించుకుంటున్నారు. పంచాయతీ రాజ్ అధికారులు చొరవ తీసుకుని రాజనగరం వెళ్లే మార్గాన్ని అక్రమాలకు గురికాకుండా చర్య తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆర్‌అండ్‌బి శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని దెబ్బతిన్న ఆర్‌అండ్‌బి రోడ్డు ను వెంటనే బాగు చేయాలని మండల బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కొత్త రవిందర్‌రావు కోరారు.

# వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్షై



వెల్టూరులో పూరి గుడిసెలో ఉన్నవారి వివరాలు సేకరిస్తున్న ఎస్సై లెనిన్

**ఉప్పునుంతల, జులై 23 ప్రభాతవార్త:** ఇటీవల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై లెనిన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తిప్పాపూర్, వెల్టూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా పూరిగుడిసెలు, మట్టి మిద్దెలను సందర్శించి అందులో నివాసం ఉంటున్న కుటుంబాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాల కారణంగా గుడిసెలు, మట్టి మిద్దెలలో ఉండరాదని అవసరమైతే గ్రామంలో ప్రభుత్వ భవనాలను నివాసం ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో యువకులు మత్తుపదార్థాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు, గంజాయి లాంటివి అమ్మిన, వినియోగించిన చట్టపరమైన చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. మత్తు పదార్థాలకు బానిసైన వారు ఎవరైనా ఉంటే ఆ వివరాలను తమకు అందజేయాలని కోరారు. మత్తు పదార్థాలకు బానిసైన వారిని కౌన్సిలింగ్ ద్వారా వారిలో మార్పును తీసుకురావచ్చని ఆయన వివరించారు. ఎస్సైతో పాటు మాజీ సర్పంచ్‌లు గుండెమోని లింగమయ్య, రాగి వేణు గోపాల్‌రెడ్డి, నాయకులు గుద్దేటి బాలరాజు, టి.జైపాల్‌రెడ్డి, బాలయ్య, జహంగీర్, శంకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

# బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం

- **కుర్చీని కాపాడుకునేందుకు మోడీ బడ్జెట్ రూపకల్పన**
- **మిత్రపక్షాలను బుజ్జగించేందుకు రూపొందించిన బడ్జెట్**
- **కేంద్ర బడ్జెట్‌పై భూత్పూర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సత్తూర్ బస్వరాజ్‌గౌడ్**



**భూత్పూర్, జులై 23, ప్రభాతవార్త:** కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని బీజేపీ సర్కార్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ప్రధాని మోడీ తెలంగాణకు తీరని అన్యాయం చేశారని, కేవలం మిత్రపక్షాలను బుజ్జగించేందుకు, ప్రధాని మోడీ తన కుర్చీని కాపాడుకునేందుకు బడ్జెట్ రూపొందించారని బీఆర్ఎస్ భూత్పూర్ మండల పార్టీ అధ్యక్షుడు, భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ విమర్శించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టిన నేపథ్యంలో మంగళవారం చైర్మన్ ప్రభాతవార్తతో మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ సర్కార్ ఏర్పాటుకు సహకరించిన టీడీపీ, జెడీయు తదితర పార్టీలు జారీ పోకుండా, వారిని బుజ్జగించడానికే బడ్జెట్ రూపొందిందా..అన్న సందేహం వస్తోం దన్నారు. టీడీపీ నుంచి 16, జెడీయు నుంచి 12మంది ఎంపీల బలమే కేంద్రంలోని బీజేపీ సర్కార్‌ను గట్టెకించాయని బడ్జెట్‌లో ఆ రాష్టాలకే ప్రధాని మోడీ ఎక్కువ నిధులు కేటాయించారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ అమరావతి అభివృద్ధి కి రు.16వేల కోట్లు కేటాయించిన ప్రధాని తెలంగాణకు నిధులు కేటాయించకపోవడం ఆయన పక్షపాత వైఖరిని తెలియ జేస్తోందన్నారు. తెలంగాణ నుంచి 8ఎంపి స్థానాలు దక్కించుకున్న బీజేపీ ఎంపిలు, నేతలు తెలంగాణకు జీరో బడ్జెట్ కేటాయింపులపై నోరు మెదపడంలేదని విమర్శించారు. తెలంగాణలో వెనకబడిన మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల రైతులను ఆదుకునేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఇప్పటికైనా తెలంగాణ బీజేపీ, కాంగ్రెస్ ఎంపిలు, నేతలు తెలంగాణకు జరుగుతున్న అన్యాయం, తెలంగాణకు సున్నా కేటాయింపు బడ్జెట్‌పై నోరు తెరవాలని చైర్మన్ బస్వరాజ్‌గౌడ్ హితవు చెప్పారు.

# స్థానిక సంస్థలను బలోపేతం చేయడమే బిజెపి ధ్యేయం

**● బిజెపి జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు ఎస్.రామచంద్రారెడ్డి**



**మల్దకల్ జులై 23 ప్రభాతవార్త:** మల్దకల్ మండల అధ్యక్షులు పాలియి రాముడు ఏర్పాటు చేసిన బిజెపి కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్థానిక సంస్థలకు పెద్ద పీట వేశారని గత కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నంతకాలం ప్రతి వ్యక్తికి కనీసం 180 రూపాయల కూడా ఇచ్చే పరిస్థితి లేకుండానే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 2014 నుండి పెంచుతూ 500 శాతం పెంచి ప్రతి వ్యక్తికి ఇప్పుడు 900 రూపాయలకు చేరువైందని ఈరోజు గ్రామాలలోఅభివృద్ధి జరుగుతంది. మోడీజీ యొక్క సంకల్పంతో అభివృద్ధి చెందిందని ఉదాహరణకు చూస్తే గ్రామాలలో వేసే సీసీ రోడ్లు, డ్రైనేజీలు, రైతు వేదికలు, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, ఉచితంగా ఐదు కేజీల బియ్యం, ఎల్ఈడి బల్బులు, ప్రధానమంత్రి ఆవాజి యోజన కింద ఇండ్లు గ్రామీణ ఉపాధి హామీ నిధులు పెంపు, ఈ రకంగా చెప్పుతూ పోతే ఎన్నో రకాల సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాలు గ్రామపంచాయితీలకు, మండల మరియు జిల్లా పరిషత్తులకు, మున్సిపాలిటీలకు ఎన్నో నిధులు ఇచ్చి స్థానిక సంస్థలను ఆదుకున్నాడని అన్నారు. కావున రాబోయే స్థానిక సంస్థల్లో భారతీయ జనతా పార్టీకి పెద్ద ఎత్తున మద్దతు తెలిపి జిల్లాలో మెజార్టీ గ్రామపంచాయితీలు, మండల పరిషత్తులు, అదే విధంగా జిల్లా పరిషత్ కు బిజెపి అభ్యర్థులు గెలిపించడని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిషన్ మోర్చా అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్టి మోర్చా అధ్యక్షులు భీమ్లా నాయక్, మాజీ సర్పంచు దామా నాగరాజు, సీనియర్ నాయకులు జనార్దన్ రెడ్డి, మండల పదాధికారులు, పోలింగ్ బూత్ అధ్యక్షులు, కిసాన్ మోర్చా అధ్యక్షులు దర్పల్లి, మైనార్టీ మోర్చా అధ్యక్షులు ఖాజ మైనుద్దీన్ , కృష్ణరెడ్డి, రెడ్డెప్ప, వీరన్న గౌడ్, వివిధ మోర్చా మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

## బాధితుల అండగా సీఎం రిలీఫ్ ఫండ్



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న దృశ్యం

**చిన్నచింతకుంట, జులై 23ప్రభాతవార్త:** ఆపదలో ఉండే బాధితులకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్ నిలుస్తుందని స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం దమగ్నాపూర్‌లోని తన స్వగృహంలో బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. మండలంలోని మద్దూరుకు చెందిన ముగ్గురు, బందర్‌పల్లికి చెందిన ఒకరికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మొగిలన్న, బాలవర్ధన్, దామోదర్, జంగం రవి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు వివక్ష

◆ మొండి చేయి చూపిన కేంద్ర బిజెపి ప్రభుత్వం
◆ సిపిఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు

**గద్వాల జులై 23 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం నేడు పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ రాష్ట్రానికి చిన్న చూపు, మొండి చేయి చూపిందని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు పార్లమెంటు ఎన్నికల్లో 8 మంది బిజెపి పార్లమెంటు సభ్యులుగా గెలిపిస్తే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి బడ్జెట్లో నిధులు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ మాచర్ల గద్వాల రైల్వేకు, విభజన చట్టంలో ఉన్న బయ్యారం ఉక్కు పరిశ్రమ కాజీపేట రైల్వే కోచ్ పరిశ్రమ గిరిజన యూనివర్సిటీకి, ఏవి అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ప్రధానమంత్రి పలు ఎన్నికల సభల్లో బిజెపి మళ్లీ దేశంలో అధికారంలోకి వస్తే తెలంగాణను అన్ని విధాలుగా బడ్జెట్‌లో ఆదుకుంటామని గొప్పలు చెప్పి ఓట్లు దండుకుని నేడు అధికారంలోకి వచ్చి తెలంగాణకు మొండి చేయి చూపెట్టడం బాధాకరమని అన్నారు. అన్ని రంగాల్లో బడ్జెట్ తెలంగాణకు మోసం చేసిందన్నారు. తెలంగాణకు ఇంత అన్యాయం జరుగుతుంటే మాట్లాడని బిజెపి తెలంగాణ ఎంపీలు తెలంగాణ నుండి కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు పదవులు ఎందుకు తెలంగాణకు ఇంత అన్యాయం జరుగుతుంటే రాజీనామా చేసి ఢిల్లీలో కొట్లాడాలని అన్నారు. బిజెపి ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా తెలంగాణకు నిరాశపరిచిందని, తెలంగాణ అంటే శత్రువుగా మోడీ బిజెపి చూడటం సరి కాదని రాజకీయ కారణాలను చూడటం దుర్మార్గం అన్నారు.

## కోయిల్‌సాగర్‌లో నిలకడగా నీటిమట్టం

**దేవరకద్ర, జులై 23 ప్రభాతవార్త:** జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్‌లో మంగళవారం నిలకడగా ఉంది. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ స్థోమత 32.5 ఫీట్లు. ప్రాజెక్టులోకి కొత్త నీరు వచ్చి చేరుతుండటంలో కోయిల్‌సాగర్‌కు జలకళ వస్తుంది.

## కృష్ణా ఆగ్రహారం ఫిల్టర్ బెడ్ మంచినీటి సరఫరాను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



ఫిల్టర్ బెడ్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ కేశవ్

**గద్వాల జులై 23 ప్రభాతవార్త:** గద్వాల పట్టణంలో గత 5 రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా త్రాగునీరు, దుర్వాసన వస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కృష్ణానది ఆగ్రహారం నందు గల ఫిల్టర్ బెడ్ మంచినీటి సరఫరాను మున్సిపల్ చైర్మన్ బి.యస్.కేశవ్ మంగళవారం పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా గద్వాల ప్రజలకు త్రాగునీటికి ఎలాంటి సమస్యలు లేకుండా ఎప్పటికి, అప్పుడు నీటి సరఫరాను పరిశుభ్రంగా సరఫరా చేయాలని మున్సిపల్ అధికారులకు డిఇఏఇ లకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామచందర్, సురేశ్, రాంపురం రఘు, మున్సిపల్ అధికారులు డిఇఏఇ తదితరులు ఉన్నారు.

## గర్భిణులకు పరీక్షలు



**గద్వాల జులై23 ప్రభాతవార్త:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉప్పేరు పరిధిలోని, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సంగాల యందు గర్భిణీ స్త్రీలను వైద్యాధికారిణి, డాక్టర్ ఏంజెల్ పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు చేయించుకోనుటకు అవగాహన కల్పించడం జరిగింది. ప్రస్తుతం వర్షాలు ఎక్కువ పడుతున్నందు వల్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి గ్రామంలో అవగాహన కల్పించడం జరిగింది. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత గురించి గ్రామంలోని ప్రజల్లో అవగాహన కల్పించడం జరిగింది. అదే విధంగా ముందస్తుగా నెలలో కాన్పు ఈడిడి డెలివెరీస్ ఉన్న వారి గురించి వివరాలను తెలుసుకుని, వారిని ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు చేసుకునే విధంగా అవగాహన కల్పించడం జరిగింది. అదే విధంగా ప్రజలందరూ ఈ వర్షాకాల సమయంలో త్రాగే మంచినీరు కాచి చల్లార్చి త్రాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం రాధా, ఆశాలు పాల్గొన్నారు.

## చెక్‌డ్యామ్ సమస్యను పరిష్కరిస్తాం



చెక్‌డ్యామ్‌లోని నీటిని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు

**చిన్నచింతకుంట, జులై 23 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఊకచెట్టు వాగుపై వంతెన కింద నిర్మించిన చెక్ డ్యాంలో సాగునీరు నిలిచిపోయి మంచినీటి బోరు బావులు కలుషితం కావడంతోపాటు సమీపంలోని కాలనీ వాసులు నీటినిల్వ కారణగా దోమలు ఉత్పన్నమై అనారోగ్యాల పాలవుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని చెక్‌డ్యామ్ సమస్యను పరిష్కరిస్తానని పలు సందర్భాల్లో స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ హామీలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలో ఇరిగేషన్ శాఖ అధికారులతో చెక్‌డ్యామ్ నీటి తరలింపు సమస్యను పరిష్కారం చూపాలని ఆదేశించడంతో మంగళవారం పార్టీ మండల అధ్యక్షులు నరెందర్‌రెడ్డి అప్పంపల్లి సింగిల్‌విండో చైర్మన్ సురెందర్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్. వెంకటేష్, మాజీ కో ఆప్షన్ సభ్యులు మహమూద్ ఆధ్వర్యంలో ఊకచెట్టు వాగులోనిర్మించిన చెక్ డ్యాంను పరిశీలించారు. మూడు రోజులలో చెక్‌డ్యామ్‌లోని నీటిని కిందికి పంపేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులు రానున్నారని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చెక్‌డ్యాం సమస్యను పరిష్కారం చూపుతామని నేతలు తెలిపారు. వీరివెంట మండల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకండి



**ఉప్పునుంతల, జులై 23 ప్రభాతవార్త:** గ్రామాలలో యువకులు మంచిగా చదువుకొని ఉన్నతమైన విద్యపట్ల దృష్టి సారించాలని, కొంతమంది యువకులు మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్నారని అలా కాకుండా ఉండాలని ఎస్సై లెనిన్ అవగాహన కల్పించారు. గురువారం మండలంలోని వెల్టూరు, తిప్పాపూర్ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో యువకులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో చదువుకుని ఖాళీ సమయంలో తప్పుడు నిర్ణయం తీసుకోవడంతో జీవితాంతంనష్టాన్ని అనుభవించాల్సి వస్తుందని, చదువుకున్న యువకులు ఉన్నతమైన చదువుకునే విధంగా దృష్టి సారించాలని కొంత మంది చేస్తున్న తప్పుడు నిర్ణయాలకు యువకులు బలి కాకుండా చూసుకోవాలని యువకులకు సూచించారు. గ్రామంలో ఎక్కడైనా గంజాయి లాంటి మత్తు పదార్థాలు ఉన్నట్లు సమాచారం అందిన వెంటనే చర్యలుతీసుకుంటామని గ్రామాల్లోఅలాంటి మత్తుపదార్థాలకు తావివ్వకుండా అందరూ చైతన్యవంతులు కావాలని ఎస్సై వారికి సూచించారు.

## అభివృద్ధి నిధులకై మంత్రితో కూచకుళ్ల భేటీ..



మంత్రి సీతక్కతో ఎమ్మెల్యేలు రాజేష్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 23 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ గ్రామీణప్రాంతాల్లో నూతన బీటీ రోడ్ల నిర్మాణం కోసం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్కతో ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. ఎన్నో ఏళ్లుగా గిరిజన తండాలు మారుమూల పల్లెలు బీటీ రోడ్లకు నోచుకోకపోవడంతో రవాణా సౌకర్యాలు ఇబ్బందికరంగా మారాయని, అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు కూడా వెళ్లలేని పరిస్థితిలో ఉన్నాయని ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామీణ ప్రాంతాలు గిరిజన తండాలు అభివృద్ధి వైపు అడుగులు వేయాలంటే రవాణా సౌకర్యాలు ఖచ్చితంగా ఉండాలని మంత్రి సీతక్క ఎమ్మెల్యే తీసుకెళ్లిన సమస్యలపై సానుకూలంగా స్పందించారు. అందుకు సంబంధించిన అధికారులకు లేఖను పంపించారు. కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తదితరులు ఉన్నారు.

## ఇంటిగ్రేటెడ్ ఆదర్శ పాఠశాల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్



మంగనూరు శివారులో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

**బిజినేపల్లి,జులై 23 ప్రభాతవార్త:** మంగనూరు శివారు ప్రాంతమైన చేగుంట స్టేజీ దగ్గర నాగరర్‌కర్నూల్ నియోజకవర్గానికి సంబంధించిన సర్వే నంబర్ 801లో ఉన్న ఆదర్శ పాఠశాల నిర్మాణానికి కావలసిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పరిశీలించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధికి చెందిన ఇంటిగ్రేటెడ్ ఆదర్శ పాఠశాల నిర్మాణానికి 20 ఎకరాల స్థలం కావాలని, సువిశాలమైన క్రీడా ప్రాంగణం విశాలమైన క్రీడా ప్రాంగణం విశాలమైన తరగతి గదులు, ఉపాధ్యాయుల వసతి గృహాలు తదితర నిర్మాణాలతో సువిశాల ప్రాంగణం ఉండేలా ప్రభుత్వ భూమి చూడాలని కలెక్టర్ తహసిల్దార్‌ను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ ఆదర్శ పాఠశాలకు అనువైన స్థలాన్ని పరిశీలించాలని ఆర్డీఓను ఫోన్ ద్వారా ఆదేశించారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారి రమాదేవి, బిజినపల్లి తహసిల్దార్ శ్రీరాములు, ఎంపిడిఓ కథలయ్య, పిఆర్ ఏఈ రెడ్డప్ప ఉన్నారు.

## బోనాల సంబరాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆల



**భూత్పూర్,జూలై 23,ప్రభాతవార్త :** మంగళవారం భూత్పూర్ పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌లో నిర్వహించినబోనాల వేడుకలో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.మహిళలు అమ్మవారికి సమర్పించే బోనాల ఘటాల ఊరేగింపులో కొంతసేపు నడిచి మాజీ ఎమ్మెల్యే ఆల తన అభిమానాన్ని చాటారు.ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ పార్టీ భూత్పూర్ మండల అధ్యక్షుడు,మున్సిపల్ ఛైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్,మండల పరిషత్ మాజీ వైస్ ఛైర్మన్ నరేష్‌గౌడ్‌తో పాటు నాయకులు గడ్డం రాములు,సత్తూర్ అశోక్‌గౌడ్, సత్తూర్ సురేష్‌గౌడ్, సత్తూర్ రాకేష్‌గౌడ్, వెంకటేష్, మూస బాలస్వామి తదితరులు ఉన్నారు.

## అర్హులైన రైతులందరికి రుణమాఫీ వర్తిస్తుంది

**లింగాల,జులై 23 ప్రభాతవార్త :** అర్హులైన రైతులందరికి రుణమాఫీ వర్తిస్తుందని జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అంబట్‌పల్లి గ్రామంలో రైతులతో లక్ష రూపాయలు రుణమాఫీ అయిన లబ్దిదారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం మొదటి దశలో లక్ష రూపాయల వరకు మాఫీ అయిందని తెలిపారు. రైతులకు ఎవరికైనా సందేహాలు, ఫిర్యాదులో ఉంటే మండల కేంద్రంలోని రైతు వేదికలో సహాయక కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నాగార్జునరెడ్డి, విస్తరణ అధికారి శివానందు రైతులు పాల్గొన్నారు.

**రుణమాఫీ వివరాలు పరిశీలన:** మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అంబట్‌పల్లి కార్యాలయంలో సందర్శించి రుణమాఫీ వివరాలను జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన కార్యాలయాన్ని సందర్శించి లక్ష వరకు రుణమాఫీ అయిన వారికి కొత్త రుణాలు ఇవ్వాలని కోరారు. లక్ష వరకు రుణం ఉండి రుణమాఫీ కానీ వివరాలను జిల్లా కార్యాలయానికి పంపాలని ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నాగార్జునరెడ్డి, సీఈఓ పాండు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి రూ.20,220లు స్వాధీనం

### -నలుగురిపై కేసు నమోదు



**కల్వకుర్తి, జూలై23 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణ శివారులోని వ్యవసాయ పొలంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సీఐ నాగర్జున, ఎస్ఐ మాధవరెడ్డిలు తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వమించారు. ఈ దాడుల్లో నలుగురు వ్యక్తులు మొగులాల్, మధు, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డిలను పెట్టుకొని వారి వద్ద నుంచి రూ.20వేల 220లను స్వాధీనం చేసుకొని పేకా ముక్కలు సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## సమయపాలన పాటించిన అధికారులు

**గోపాల్‌పేట జులై 23 ప్రభాతవార్త :** సమయపాలన లేని అధికారులు పాటించని అధికారులు గోపాల్పేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఉదయం 10:30 అయినాకూడా ఆఫీసును తెరవకపోవడంఅధికారుల అలసత్వం తో పట్టించుకోకపోవడం, ఆఫీసుకి వచ్చిన ప్రజలకు ఇబ్బందిగా మారిపోయింది, ఉదయం 10:30 అయిన ఒక్క ఉద్యోగి కూడా ఆఫీస్ తాళం తీసేవారు కరువయ్యారు అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి అని కార్యాలయం వచ్చిన ప్రజలు డిమాండ్ చేశారు.



తాళంతో ఉన్న గోపాల్‌పేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం

# ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

### - నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ జిల్లా, ప్రతినిధి,జూలై 23 ప్రభాతవార్త:** తిమ్మాజిపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ మంగళవారం అకస్మిక తనిఖీ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ కార్యాలయంలోని ప్రజా పాలన దరఖాస్తుల దారులు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500ల గ్యాస్ సిలిండర్ పొందేందుకు లబ్ధిదారుల ధరఖాస్తుల సవరణ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలనలో తప్పులు దోర్లిన అర్హులైన లబ్ధిదారులను అసౌకర్యాలకు గురి చేయకుండా తప్పులను సరి చేసి ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందే విధంగా చూడాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన సవరణ కేంద్రం వద్ద లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ సమస్యలు పరిష్కారం కాకపోతే నేరుగా తనను కలవచ్చునని కలెక్టర్ లబ్ధిదారులకు సూచించారు.అనంతరం తిమ్మాజిపేట రతు వేదికలో కొనసాగుతున్న రుణమాఫీ సమస్యల పరిష్కార కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. అక్కడికి వచ్చిన రైతులకు రుణమాఫీ ఎందుకు



రైతు వేదికలో రుణమాఫీ ప్రక్రియలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్



బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

జరగలేదో వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకున్నారు. అందుకు గల కారణాలను రైతులకు వివరించి రుణమాఫీ డబ్బులు వెంటనే రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటి వరకు మండలంలో లక్ష లోపు మంది రైతులకు రుణమాఫీ జరిగిందని, ఇంకా ఎంత మందికి జరగాల్సి ఉందని, ఎందుకు జరగలేదో రైతులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలన్నారు. అదే విధంగా తిమ్మాజిపేట యూనియన్ బ్యాంక్‌లో జరుగుతున్న రుణమాఫీ ప్రక్రియను కలెక్టర్ అకస్మికంగా సందర్శించి బ్యాంకులో రైతు ఖాతాలో జమవుతున్న రైతు రుణమాఫీప్రక్రియను కలెక్టర్ స్వయంగాపరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బ్యాంక్ సిబ్బంది చూడాలని కలెక్టర్ ఆదేశించారు. అక్కడి నుంచి మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ధరణి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు పరిష్కరించిన ధరణి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తిమ్మాజీపేట తహసీల్దార్ జీకే.మోహన్, ఎంపీడీఓ లక్ష్మిదేవి, మండల వ్యవసాయాధికారి కమలేశ్వర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

# ప్రతి విద్యార్థి కొత్త ఆవిష్కరణలు చేయాలి

### - యువత మెదడుకు పదును పెట్టాలి
### - కళాశాల ప్రిన్సిపల్ జీ.మాధవి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 23 ప్రభాతవార్త:** సమాజంలో ప్రతి సమస్యకు ఒక శాశ్వత పరిస్కారం కనుగొనడానికి యువతలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇంటింటా ఇన్నోవేషన్ 2024 కార్యక్రమం చేపట్టిందని కళాశాల ప్రిన్సిపల్ జీ.మాధవి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల నాగర్‌కర్నూల్‌లో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శ్రీవాణి పాల్గొని విద్యార్థులకు ప్రొజెక్టర్ ద్వారా ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని వివరించారు. యువత నేడు సమాజంలోని వ్యవసాయం, దివ్యాంగుల సమస్యలు, ప్రభుత్వ పథకాలు, ట్రాఫిక్ నిబంధనలపై,ప్రమాదాల భారినపడకుండా తప్పించుకోవడానికి కొత్త కొత్త ఆవిష్కరణలు, సామాజిక సమస్యలపై అవగాహన కొరకు ఇన్నోవేటివ్ ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలు చేయాలని వాటిని 100 పదాలకు మించకుండా లేదా 2 నిముషాల నిడివి గల వీడియోలు తయారు చేసి 9100678543 నెంబరుకు వాట్సాప్ ద్వారా పంపాలన్నారు. వాటిని ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం నాడు జిల్లా అధికారులు పరిశీలించి తగిన ప్రొత్సాహక బహుమతులు ఇచ్చి యువతను ప్రొత్సాహించాలని ప్రభుత్వం సంకల్పించిందని, మరియు ప్రభుత్వ పరంగా ప్రొత్సహించి బహుళ ప్రాచుర్యములోనికి తేవడానికి ఈ



ఇంటింటా ఇన్నోవేటివ్ 2024 కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ జీ.మాధవి

కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని కోఆర్డినేటర్ పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జీ.మాధవి మాట్లాడుతూ విద్యార్థులకు ఈ వయస్సు నుంచే సైంటిఫిక్ ఆలోచనలు, కొత్త స్టార్టప్‌లు డెవలప్ చేసే విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమం విద్యార్థులకు, యువతకు ఉపయోగపడుతుందన్నారు. ప్రిన్సిపాల్ జీ.మాధవి అధ్యాపకులతో కలిసి ఇంటింటా ఇన్నోవేటివ్ 2024కార్యక్రమ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు బగవేని నర్సింహ్ములు, రవి ప్రకాష్, హరిత, తస్కీన్ హిప్సా, భయ్య రాజయ్య, తదితరులు ఉన్నారు.

# ప్రజా సమస్యలు తీర్చే విధంగా మార్పు తేవాలి

### అఖిలపక్ష ఐక్య వేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్

**వనపర్తి టౌన్ జులై23 ప్రభాతవార్త:** వనపర్తిలోని పలు సమస్యలపై అధికారులకు ప్రజాప్రతినిధులకు సంవత్సరాలుగా వినతి పత్రాల ద్వారా విన్నవించుకున్నా వారు సమస్యలపై స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు ఉండడాన్ని ఖండిస్తూ మీకు ఈ వినతి పత్రం అందిస్తున్నాము. పాలిటెక్నిక్ కళాశాల భవనం మరమ్మత్తులు, పాత బస్టాండ్ ఓపెన్ చేసి అక్కడున్న పూల షాపు వారికి జీవనోపాధి కల్పిస్తూ మిగిలిపోయిన రోడ్డు వెడల్పు చేయాలని, అవినీతి అక్రమాలు చేస్తున్న అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలని, అప్పనంగా మున్సిపాలిటీ, హాస్పిటల్ కు సంబంధించిన పాత సామాన్లు అమ్ము కున్న వారిపైచర్యలు తీసుకోవాలని, అఖిలపక్ష ఐక్యవేదిక పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ ఈ రోజు మికు వినతి పత్రాన్ని సమర్పించడం జరుగుతున్నది. అలాగే వర్గ విభేదాలతో అభివృద్ధి కుంటి పడుతుందని వాటిని కూడా నివారి ంచి ఏకతాటిపై వచ్చి అభివృద్ధికి పాటుపడాలని లేని ఎడల ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి , హైకోర్టుకు పిల్ వేస్తామని అఖిలపక్ష ఐక్యవేదిక డిమాండ్ చేస్తున్నది. అన్ని కుల సంఘాలతో అన్ని పక్షాలతో మాట్లా డిన తర్వాత ఆగష్టు 15 తర్వాత నిర్ణయం తీసుకుని పై పనుల మొదలు



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు

పెట్టకుంటే ధర్నాలు దీక్షలు చేపడతామని ఈ సందర్భంగా నాయకులు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్ తో పాటు టీ.జే.ఎస్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్ పాషా, రాష్ట్ర తెలుగు యువత నాయకులు కొత్త గొల్ల శంకర్, సిపిఐ నాయకులు రమేష్, నాయకులు బొడ్డుపల్లి సతీష్, గౌని కాడి యాదయ్య పాల్గొన్నారు.

# ఐఎస్ స్మితా సబర్వాల్‌ను డిస్మిస్ చేయాలి

### మహాజన్ ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు

**వనపర్తి టౌన్ జులై 23 ప్రభాతవార్త :** వికలాంగుల హక్కుల పోరాట సమితి (విహెచ్‌పిఎస్) ఆధ్వర్యంలో ఐఏఎస్ స్మితా సబర్వాల్ పై ఎస్పీ కార్యాలయంలో పిటిషన్ ఇవ్వడం జరిగింది. అనంతరం ప్రభాకర్ శెట్టి విహెచ్‌పిఎస్ వనపర్తి జిల్లా కన్వీనర్, గంధం గట్టయ్య మాదిగ ఎమ్మార్పీఎస్ అనుబంధం సంఘాల సమన్వయకర్త పాల్గొని మాట్లాడుతూ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌ను విధుల నుండి వెంటనేతొలగించాలని ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు, వికలాంగులను అవమాన పరిచిన ఐఏఎస్ స్మితా సబర్వాల్‌ని వెంటనే డిస్మిస్ చేయ్యాలి, రాష్ట్ర వ్యాప్తంగా మందకృష్ణ మాదిగ నాయకత్వ ములో రాష్ట్ర వ్యాప్తంగా, ఆందోళనలు చేస్తామన్నారు, వికలాంగులగా పుట్టడమే పాపమా అని ప్రశ్నించారు. జాలీ చూపాల్సిన ఐఏఎస్ అధికారి ఇలా మాట్లాడడం రాజ్యాంగ విరుద్ధంఅన్నారు, బాబాసాహెబ్ అంబేద్కర్ వికలాంగులు కూడా సకలాంగులతో సమానంగా బ్రతకాలని రిజర్వేషన్ ఇస్తే ఆ రిజర్వేషన్ల ద్వారా ఉద్యోగాలు చేస్తుంటే ఓర్చుకోలేనిమీరు ఐఏఎస్‌అధికారిగా పదవిలో కొనసాగే నైతిక విలువలను కోల్పోయారు. ఒక వేళ వికలాంగులకు రిజర్వేషన్ లు లేకుంటే కనీసం మనిషిగా కూడా చూసేవారు కాదన్నారు, అత్యున్నత పదవిలో ఉండి దివ్యాంగ సమాజ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసెలా ట్వీట్ చేసి, దివ్యాంగుల హక్కులకు బంగం కలిగిస్తూ మాట్లాడిన స్మితా సబర్వాల్‌ని వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం శిక్షించి, వెంటనే సస్పెండ్ చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి విహెచ్‌పిఎస్ తరపున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, సిఎం రేవంత్‌రెడ్డి ని డిమాండ్ చేస్తున్నాము, ఈ కార్యక్రమంలో, శ్రీనివాసులు, కృష్ణయ్య, శివ నాయక్, బంజరా గిరిజన సమితి రాష్ట్ర అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు

# ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఎలోకి మార్చాలని వినతి

**కల్వకుర్తి, జూలై 23 ప్రభాతవార్త:** సమాజంలో ఎన్నో సంవత్సరాలుగా అన్ని రంగాల్లో వెనుకబడిన ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఎలోకి మార్చాలని డీఎఫ్‌సీఎస్ జిల్లా డైరెక్టర్ గొడుగు బాల్‌చందర్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ ఇబ్రహీంకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 ఎన్నికల్లో మెనిఫెస్టో హామీలో భాగంగా ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఎలోకి మార్చి వారి ఆర్థికాభివృద్ధికి దోహద పడాలని కోరారు. ముదిరాజ్‌లు ఎక్కువ శాతం మత్స్య వృత్తిపై ఆధారపడి జీవిస్తారని, మత్స్యకారుల అభివృద్ధికి తెలంగాణ మత్స్య అభివృద్ధి బోర్డు, కార్పొరేషన్ ఏర్పాటు చేసి తగిన నిధులు కేటాయించి ఆదుకోవాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో నాగర్‌కర్నూల్ జిల్లా ముదిరాజ్ మహాసభ యువజన సంఘం అధ్యక్షులు జమ్ముల శ్రీకాంత్, నాయకులు కొల్లూరి శ్రీధర్, రామస్వామి, పుట్ట వెంకటయ్య, తాడెం జంగయ్య, శ్రీకాంత్, బండారు శ్రీనివాసులు, చింతమౌని యాదయ్య, కొండ్ల ఆంజనేయులు, సురేష్, రాజశేఖర్, యాదయ్య, తిరుపతయ్య తదితరులు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## నర్సింగాపూర్ డబుల్ బెడ్ ఇళ్ల పరిశీలన



నర్సింగాపూర్ వద్ద నిర్మించిన డబుల్ బెడ్ ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మార్వో రాజు,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ తదితరులు

**భూత్పూర్,జులై 23,ప్రభాతవార్త:** భూత్పూర్ పట్టణంలోని రెండో వార్డు నర్సింగాపూర్ శివారులో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మిస్తున్న డబుల్ బెడ్ ఇళ్ల నిర్మాణపు పనుల్ని మంగళవారం భూత్పూర్ తహసిల్దార్ రాజు యు,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ పరిశీలించారు.ఈ సందర్భంగా తహసిల్దార్ రాజు యు మాట్లాడుతూ నిర్మాణ పనులు దాదాపు 90శాతం పూర్తయ్యాయని, విద్యుత్తు,తాగునీటి పైప్‌లైన్ పనులు మాత్రమే మిగిలి పోయాయని,ఎమ్మెల్యే జీఎంఆర్ ఆదేశాల మేరకు వీలైనంత త్వరలో వాటిని పూర్తి చేసేందుకు సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు పూర్తయ్యేలా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలోమండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్‌గౌడ్‌తో పాటు నాయకులు అనుప అంజనేయులు,అఫ్రోజ్,నేనావత్ వెంకటేష్,ముస్తాఫా పాల్గొన్నారు.

## మురుగునీరు తొలగించండి



ఆత్మకూరులో ని ఏడవ వార్డులో నిలిచిన వర్షపు నీరు

**ఆత్మకూర్ జులై 23 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో గత ఐదు రోజులుగా కురుస్తున్న ఉసురు వర్షాలకు పట్టణంలోని ఏడవ వార్డులో మురుగునీరు చేరిపోయి అంటువ్యాధుల బారిన పడుతున్నామని అధికారులు మురుగునీరు తొలగించాల్సిందిగా కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. గడచిన రెండు రోజులుగా మున్సిపల్ అధికారులకు వివరించినప్పటికి మురుగునీరు తొలగించడంలో అశ్రద్ధ గణపరహరుస్తున్నారని కాలనీవాసుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో కాలనీవాసులకు డెంగి, మలేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడే కార్యక్రమంలో నైనా ఏడవ వార్డులో పర్యటించి మురుగునీటిని తొలగించి అంటువ్యాధుల భారి నుండి రక్షించాల్సిందిగా కాలనీవాసులు మున్సిపల్ పాలకవర్గానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**కల్వకుర్తిరూరల్, జూలై 23 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన దొక్క చంద్రయ్య మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ జిల్లెల్ల రాములు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి మృతుడి కుమార్తె రేణుకకు రూ.3వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, దేవాలయ చైర్మన్ రవిగౌడ్, మాజీ వార్డు సభ్యులు పాండురంగారెడ్డి, మహేందర్,బాల్‌జంగయ్య,బాలమైసయ్య,మౌనిక మల్లయ్య, కాంగ్రెస్ పార్టీనాయకులు రవి, శ్రీహరి,సుల్తాన్, భీరయ్య,వెంకటయ్య, నరసింహ, కృష్ణ,రమేష్, బాలస్వామి, ప్రభాకర్, చిన్న జంగయ్య, రామకృష్ణ, మల్లేష్, మహేష్ తదితరులు ఉన్నారు.

## వార్డును అన్ని విధాల అభివృద్ధి చేస్తా

### -17వ వార్డు కౌన్సిలర్ షేక్.ఏజాస్



**కల్వకుర్తి, జూలై 23 ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపాలిటిలోని 17వ వార్డులో ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని 17వ వార్డు కౌన్సిలర్ షేక్.ఏజాస్ పేర్కొన్నారు. మంగళవారం 17వ వార్డులో కౌన్సిలర్ షేక్ ఏజాస్ మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌తో కలిసి వార్డులో పర్యటించి కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలనీలో కుక్కలు, కోతుల బెడద ఎక్కువగా ఉందని కాలనీ వాసులు తెలుపడంతో వెంటనేతొలగించాలని కౌన్సిలర్‌షేక్ ఏజాస్ మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌కు సూచించారు. వర్షకాల నేపథ్యంలో కాలనీలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలతో పాటు శిథిలావస్థలో ఉన్న మట్టి మిద్దెలను తొలగించాలని మున్సిపాలిటి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సయ్యద్ మసూద్, కాలనీ వాసులు చోటు, షారుఖ్, సలీం, ముబీన్ తదితరులు ఉన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేసింది

### -జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి



**కల్వకుర్తి, జూలై 23 ప్రభాతవార్త:** తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, ఆరుగురు ఎంపీలు ఉన్న తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో మరోసారి నిరాశ ఎదురైందని జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16 స్థానాలు ఉన్న ఏపీ, బీహార్ రాష్ట్రాలకు ఎక్కువ నిధులు కేటాయించారని, తెలంగాణ రాష్ట్రానికి మాత్రం ఎలాంటి నిధులు కేటాయించకుండా తెలంగాణ రాష్ట్రం పట్ల బీజేపీకి ఉన్న చిత్తశుద్ధిని ప్రదర్శించారన్నారు. ప్రధాని మోడీకి అదాని, అంబానీల మీద ఉన్న ప్రేమ తెలంగాణపై లేదనడానికి ఇదే నిదర్శనమన్నారు. మూడుసార్లు అధికారం చేపట్టిన మోడీ సర్కార్ తెలంగాణకు ఈ బడ్జెట్‌లో తీరని అన్యాయం చేశారని బదులిచ్చారు.